మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 172 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



విశాల సాహిత్య అకాడమీ, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం మరియు
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ సాహిత్య అకాడమీల సౌజన్యంతో
ఆహ్వానం
శతాధిక గ్రంథకర్త, తెలంగాణ బీసీ కమిషన్ తొలి చైర్మన్, సామాజిక తత్వవేత్త, కథా చక్రవర్తి, మహామహోపాధ్యాయ
బి.ఎస్. రాములు 75వ జన్మదిన అమృతోత్సవం
తేది : 23 ఆగస్టు, 2024, వేదిక : రవీంద్రభారతి, హైదరాబాద్
ఉదయం : 10:30 ని॥ల నుండి రాత్రి 8 : 00 గం॥లకు వరకు
25 ఏళ్ల తెలంగాణ సాహిత్యం: సదస్సు,
అధ్యక్షులు బి. నర్సింగరావు | కన్వీనర్స్ డా॥ కర్రె సదాశివ్, బ్రిలిత | కో-కన్వీనర్స్ డా. ఎ. గుపర్రాజు, బాజుల గాలి | కార్యదర్శి కె. కోటేశ్వరరావు



# ఆర్ఆర్ఆర్ పనులలో వేగం పెంచండి

- భూసేకరణలో పాదర్శకంగా వ్యవహరించండి
- ఏరోజుకారోజు పనుల .వివరాలు అందించాలి
- దక్షిణ ప్రాంతంలో భూసేకరణకు దిగాలి
- ట్రిపుల్ఆర్పై సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు
- ఫ్యూచర్ సిటీకి రేడియల్ రోడ్లు తదితర పనులపై ఆరా

హైదరాబాద్, (ప్రజా మంటలు): రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం భూసేకరణను పారదర్శకంగా, వేగంగా చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నారు.. పనుల పురోగతి ఏంటనే దానిపై రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారం తనకు అందజేయా లన్నారు. ఆర్ఆర్ఆర్ ప్రగతిపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు సంబంధించిన వివరాలను మిగతా 2లో..

## నాకు సొంతంగా ఫామ్‌హౌజ్‌లు లేవు

- జన్వాడ ఫామ్ హౌస్ భవనం లీజు మాత్రమే
- అక్రమమైతే దగ్గరుండి కూల్చేయిస్తా
- మంత్రుల పామ్ హౌజ్‌ల నుంచే కూల్చివేతలు సాగాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ డిమాండ్
- రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకమని వెల్లడి



హైదరాబాద్, (ప్రజా మంటలు): జన్వాడ ఫామ్ హౌస్ అక్రమంగా ఉంటే కూల్చేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అది కేవలం తాను లీజుకు మాత్రమే తీసుకున్నానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. కూల్చివేస్తారంటూ జరుగుతున్న ప్రచారంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లో స్పందించారు. తన పేరుతో ఫామ్ హౌస్ లేదని ఆయన స్పష్టం చేశారు. తన మిత్రుడికి చెందిన ఫామ్ హౌస్‌ను తాను లీజుకు తీసుకున్నానని తెలిపారు. గత కొన్ని నెలలుగా తాను అక్కడే నివసిస్తున్నట్లు చెప్పారు. జన్వాడలోని మిగతా 2లో..

## ప్రపంచంలో అత్యుత్తమ కేంద్ర బ్యాంకర్‌గా ఆర్‌బీఐ గవర్నర్

- వరుసగా రెండోసారి ఎంపికైన శక్తికాంత్‌దాస్
- అభినందించిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ప్రపంచంలో అత్యుత్తమ కేంద్ర బ్యాంకర్‌గా వరుసగా రెండోసారీ ఎంపికైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఇది ఆయనలోని నాయకత్వానికి లభించిన గుర్తింపుగా కొనియాడారు. ఈ ఘనత సాధించిన ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్‌కు అభినందనలు. అది

## పొలిట్రిక్స్

అధికారం సందిస్తే
ఆగమించు ఆధిద్యం,
పెట్టుబడి 'ఆశ' చూపి
దిగమింగే వింత చోద్యం!

ఏ పుట్టల ఏ పామో
ఎవరికేం తెలుసును,
లో'గుట్టు' ఎప్పుడైన
పెరుమాళ్ళే ఎరుగును!

- న్యాలకంటి నారాయణ
9346200066

## రియాక్టర్ పేలి ఏడుగురు దుర్మరణం

- క్షతగగాత్రులను ఆస్పత్రికి తరలింపు
- అచ్యుతాపురం సెజ్‌లో ఘోర ప్రమాదం



విశాఖపట్టణం (ప్రజా మంటలు): అచ్యుతాపురం సెజ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు చనిపోగా.. పలువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. అచ్యుతాపురం సెజ్ లోని ఎసెన్సియా కంపెనీలో రియాక్టర్ పేలి ప్రమాదం సంభవించిది. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ కి, స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మధ్యాహ్నం భోజన సమయంలో ప్రమాదం జరగడంతో పెను ప్రమాదం కాస్త తప్పింది. ఎసెన్సియా కంపెనీలో రియాక్టర్ పేలిన ఘటనలో చల్లపల్లి హారిక (24), పూడి మోహన్ (23), దుర్గా ప్రసాద్, చిన్నారావులు మరణించారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం అనకాపల్లి ఉష ప్రైమ్ ఆసుపత్రికి తరలించి, వారికి చికిత్సను అందిస్తున్నారు. వారిలో చంద్రశేఖర్ అనే వ్యక్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక ఘటనా స్థలానికి చేరుకుంది. మంటల్ని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది. మరో రియాక్టర్ పేలే అవకాశం ఉందని అధికారులు అనుమానం వ్యక్తం చేయడంతో రెస్క్యూ ఆపరేషన్‌ను మొదలు పెట్టారు. మధ్యాహ్నం మిగతా 2లో..

## ప్రతీ రైతు రుణం మాఫీ చేస్తాం

- విపక్షాల మాటలు నమ్మొద్దు
- రుణమాఫీపై ఆందోళన వద్దు
- అందని వారు అధికారులను సంప్రదించాలి
- రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అప్పుల్లో ఉన్నా అమలు చేస్తున్నాం
- పథకంపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం (ప్రజా మంటలు): రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అప్పుల్లో ఉన్నా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు 22 లక్షల రైతు ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమ చేశామని చెప్పారు. ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తప్పులున్న వారికి మాత్రమే రుణమాఫీ ఆగిందన్నారు. వాటిని సరిదిద్ది రుణమాఫీ చేయాలని అధికారులను ఆశించామని చెప్పారు. రుణమాఫీ పొందలేని రైతులు.. వ్యవసాయాధికారులకు దరఖాస్తు చేసుకోవాలని మిగతా 2లో..


## హైడ్రా నిబంధనలు సమర్పించండి

- హైకోర్టు ఆదేశాలు
- జన్వాడ ఫామ్‌హౌజ్ కూల్చివేతపై స్టేకు నిరాకరణ



హైదరాబాద్, (ప్రజా మంటలు): జన్వాడ ఫాంహౌస్ కూల్చొద్దంటూ ప్రదీప్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఫాంహౌస్ కూల్చివేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించిన ఉన్నత న్యాయస్థానం.. నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించింది. వాదనల సందర్భంగా హైడ్రాకు ఉన్న పరిధి గురించి చెప్పాలని ఏఏజీ ధర్మాసనం సూచించింది. హైడ్రా కూల్చివేతలపై మిగతా 3లో..

## ప్రజా నాడి




## బస్టాండ్ లో షెల్టర్ కట్టిస్తాం

- అక్రమ బాంబుల (మందు పాతరల) గోదాం పెట్టిస్తాం
- అక్రమ అనుమతులకై ఆరాటం

జగిత్యాల/ బుగ్గారం ఆగస్టు. 21
(ప్రజా మంటలు ప్రత్యేక ప్రతినిధి):
జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రం పరిసరాలలో అక్రమ మైన మందు పాతరల ( బండలు పేల్చే బాంబుల ) గోదాం పెట్టేందుకు కొందరు వ్యాపారస్తులు ఆరాట పడుతున్నట్లు తెలిసింది. ఇట్టి గోదాం కు అడ్డదారిలో అనుమతులు పొందేందుకు తీవ్ర ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు విశ్వస నీయ సమాచారం. గ్రామస్తులు అనుమతి ఇవ్వకూడదని, ఇది ప్రమాదకరమని తేల్చి చెప్పారు. గ్రామ అభివృద్ధి కమిటీ పక్షాన అభ్యంతరం తెలుపుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శికి పిర్యాదు చేస్తూ బాంబుల గోదాం కు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని ఇటీవలనే విజ్ఞప్తి కూడా చేశారు.
అయినా..
కొందరు నాయకులు బాంబుల వ్యాపారస్తులతో కుమ్మక్కై దొంగ చాటుగా అనుమతులు (పర్మిషన్ లు) ఇప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది.
సంబంధిత అధికారులు కూడా అడ్డదారిలో సహకరిస్తున్నట్లు సమాచారం ఇందు కోసం బుగ్గారం బస్టాండ్ లో బస్ షెల్టర్ కట్టిస్తున్నాం - సంతకాలు పెట్టండి అంటూ గ్రామస్తులను నమ్మించి మోసం చేసి బుధవారం మిట్ట మధ్యాహ్నం సంతకాల సేకరణ చేసినట్లు గ్రామస్తులు వాపోతున్నారు.
హుటా హుటిన బస్ షెల్టర్ నిర్మాణం కోసమని సిమెంట్ బ్రిక్స్ కూడా తెప్పించి బుగ్గారం బస్టాండ్ లో డంప్ చేశారు.
గ్రామస్తులు అంతా ఇదేమిటని - ఇంత మోసమా...? అంటూ బుధవారం సాయంత్రం బస్టాండ్ లో ఆగ్రహం వ్యక్తం చేశారు.
కొందరు నాయకులు చేస్తున్న పని తీరుపై ముక్కున వేలేసుకుంటూ.... ఇలాంటి మోసాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



మొదటి పేజీ తరువాయి

# ఆర్ఆర్ఆర్ పనులలో వేగం పెంచండి

అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కలెక్టర్లు ఈ రహదారి విషయంలో రోజు వారీగా ఏం చేశారు..? ఏం పురోగతి సాధించారు..? దక్షిణ భాగంలో భూ సేకరణ పక్రియ ప్రారంభం,ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిరోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందజేయాలన్నారు. భూ సేకరణలోనూ పారదర్శకంగా వ్యవహరిం చాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి, ఆమన్‌గల్, షాద్‌నగర్,చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, అదే సమయంలో పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అన్నారు. తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలి. సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి అనువుగా ఉండాలని, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు.

# రియాక్టర్ పేలి ఏడుగురు దుర్మరణం

భోజన సమయంలో ప్రమాదం జరగడంతో పెనుప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. కాగా, ప్రమాదంపై సమాచారం అందుకున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులకు తక్షణమే చికిత్స అందించాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదం కారణంగా చుట్టుపక్కల గ్రామాల్లో చుట్టూ పొగలు అల్లుకున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు. వెంటనే ఘటన స్థలానికి అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఎస్పీ వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో రియాక్టర్ పేలి ప్రమాదం జరగడంతో పెనుముప్పు తప్పింది. లేదంటే ఇతర సమయాల్లో ఎక్కువ మంది కార్మికులు అక్కడే ఉండేవారని అంటున్నారు. ఎసెన్సియా కెమికల్ ఫ్యాక్టరీ ప్రమాదంపై హోం మంత్రి వంగలపూడి అనిత కూడా స్పందించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి.. ఫార్మా ప్రమాదంపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని హోం మంత్రి అధికారులను ఆదేశించారు.


**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు**

అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తజిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడిన ముఖ్యమంత్రి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం సెజ్ లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనలో 7 గురు ప్రాణాలు కోల్పోవడం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది అనే సమాచారం పై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన, బాధితులకు అందుతున్న సాయంపై ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనలో 7 గురు చనిపోగా... 30 మందికిపైగా తీవ్రంగా గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని జిల్లా అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. చికిత్స పొందుతున్న వారి ప్రాణాలు కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులను, పరిశ్రమల శాఖ అధికారులను అక్కడే ఉండి పూర్తి స్థాయి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం అదేశించారు.

# ప్రతీ రైతు రుణం మాఫీ చేస్తాం

సూచించారు. రైతు వేదికలు, మండల ఆఫీసుల్లో అధికారులను పెట్టి వివరాలు తీసుకుంటామని తెలిపారు. బుధవారం ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోని, పదేళ్ల పాటు రైతుల్ని మోసం చేసిన పార్టీ మొసలి కన్నీరు కారుస్తోంది. నల్ల చట్టాలు తెచ్చి రైతులను ఇబ్బంది పెట్టిన పార్టీ కూడా మాట్లాడుతోంది. అసత్యాలు చెప్పి రైతుల్లో ఆందోళన పెంచాలని చూస్తున్నారు. రుణమాఫీపై ఎలాంటి ఆంక్షలు విధించలేదు. బ్యాంకులు, అధికారులు ఏమైనా తప్పు చేస్తే.. వాటిని సరిదిద్దే పక్రియ కొనసాగుతోంది. 41,78,892 మంది రైతులు రుణాలు తీసుకున్నారని బ్యాంకులు చెప్పాయి. వారి బకాయిలు రూ.31వేల కోట్లు ఉన్నాయి. చిన్న, సన్నకారు రైతులకు ఎక్కువగా రూ.2లక్షలలోపు రుణాలే ఉన్నాయి. రుణమాఫీ విషయంలో రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ పనులు చూసుకోవాలి' అని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచంలో అత్యుత్తమ కేంద్ర బ్యాంకర్‌గా ఆర్‌బీఐ గవర్నర్



కూడా రెండోసారి. ఆర్‌బీఐలో ఆయన నాయకత్వానికి; ఆర్థిక వృద్ధి, స్థిరత్వాన్ని నిర్ధరించే దిశగా ఆయన చేసిన కృషికి ఇది గుర్తింపు అని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.అమెరికాకు చెందిన గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగ్‌జైన్ ఇచ్చిన ర్యాంకుల్లో శక్తికాంత దాస్‌కు అగ్రస్థానం దక్కింది. గ్లోబల్ ÷నాన్స్ సెంట్రల్ బ్యాంకర్ రిపోర్ట్ కార్డ్స్ 2024లో శక్తికాంత దాస్‌కు 'ఏ' రేటింగ్ లభించిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆర్‌బీఐ వెల్లడించింది. ఏ రేటింగ్‌ను ప్రపంచంలో ముగ్గురు కేంద్ర బ్యాంక్ గవర్నర్‌లకు ఇవ్వగా.. అందులో దాస్ అగ్రస్థానం పొందారు. ద్రవ్యోల్బణం, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలు, ఆర్థిక స్థిరత్వం, వడ్డీ రేట్ల నిర్వహణ ఆధారంగా కేంద్ర బ్యాంకుల గవర్నర్లకు ఏ నుంచి ఎఫ్ వరకు గ్రేడ్‌లను కేటాయించారు. అద్భుత పనితీరుకు ఏ, అధ్వాన పనితీరుకు ఎఫ్ రేటింగ్ ఇచ్చారు. ఏ? రేటింగ్ పొందిన కేంద్ర బ్యాంకర్లలో డెన్మార్క్‌కు చెందిన క్రిస్టియన్ కెటెల్ థామ్‌సన్, స్విట్జర్లాండ్ గవర్నర్ థామస్ జే జోర్డాన్ ఉన్నారు.

# రుణమాఫీపై బీఆర్ఎస్ పోరుబాట

## రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకం:కేటీఆర్

హైదరాబాద్, (ప్రజా మంటలు): :కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకమని.. రుణమాఫీ మొత్తం దగా, మోసమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్నవి అర్థసత్యాలు, అసత్యాలన్నారు. రుణమాఫీపేరుతో రైతులకు కుచ్చు టోపీ అని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరును ఎండగడుతూ..గురువారం అన్ని మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు ఉంటాయి. రేపటి ఆందోళనలు మొదటి అడుగు మాత్రమే. రైతులపై కేసులు ఉపసంహరించు కోవాలన్నారు. రుణమాఫీ చేయనందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకాలు చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఎప్పటిలోగా రుణమాఫీ పూర్తి చేస్తారో చెప్పాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. రుణమాఫీపై ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని.. రుణమాఫీపై రైతులకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ జరగక రైతులు రోడ్డెక్కుతున్నరు.. ఏ పత్రిక, ఛానల్ చూసినా ఇవే వార్తలు కనిపిస్తున్నాయి. ఆందోళన చేస్తున్న రైతులపై ఏడేళ్లు, రెండేళ్లు శిక్షలు పడే కేసులు పెడుతూ మరోవైపు అందరికి రుణమాఫీ అయిందని సీఎం సంబరాలు చేసుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం చెబుతున్నారు. రుణమాఫీపై మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారు. సాంకేతిక కారణాలతో మాఫీ కాలేదని మంత్రులు చెబుతున్నారు. భట్టి చెప్పిన లెక్కలు వింటే రుణమాఫీ వట్టిదేనని తేలిపోయింది. మాఫీ ఎట్లా ఎగ్గొడదామని



కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తుందని.. అసలు రుణమాఫీపై ప్రభుత్వానికి స్పష్టత ఉందా..లేదా.. అని కేటీఆర్ ప్రశ్నించారు. మాఫీ 30 శాతం, కాంగ్రెస్ మోసం 100 శాతమన్న ఆయన ఇది రైతు స్వరాజ్యం కాదు.. ఏడిపిస్తున్న రాజ్యమని ధ్వజమెత్తారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా బీఆర్ఎస్ ఉన్నంతకాలం రైతులకు అండగా ఉంటుందని, రైతులు స్థైర్యం కోల్పోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. చ్చి మోసగాళ్ల ప్రభుత్వం ఇదని.. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలున్నాయని చెప్పింది మీరా..కాదా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్.. ప్రభుత్వం రుణమాఫీ పేరుతో కేవలం రూ.7500 కోట్లతో సరిపెట్టాలని చూస్తున్నట్టుందన్నారు. లక్షల మంది రైతులను మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని ఏం చేయాలి..? సీఎం తడిగుడ్డతో రైతుల గొంతు కోసిండు. ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ బజారు భాష మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ను తిడితే సంబరపడే కొన్ని మీడియా సంస్థలున్నాయి. మొత్తం రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని కేటీఆర్ హెచ్చరించారు

# నాకు సొంతంగా ఫామ్‌హౌజ్‌లు లేవు

ఈ ఫామ్ హౌస్ నిబంధనల ప్రకారం లేకుంటే తానే దగ్గరుండి కూలగొట్టిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు. ఎఫ్ టీ ఎల్ పరిధిలో ఈ ఫామ్ హౌస్ నిర్మించి ఉంటే.. దానిని కూల్చివేస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని కుండ బద్దలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, సీనియర్ నేతలు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కెవిపి రామచంద్రరావు, మహేందర్ రెడ్డి, గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ తదితరులకు ఫామ్ హౌస్‌లున్నాయన్నారు. ఇక సీఎం రేవంత్ రెడ్డి ఫామ్ హౌస్ ఎక్కడ ఉందో కూడా తాను చూపిస్తానని ఈ సందర్భంగా కేటీఆర్ స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫామ్ హౌస్.. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలా ఉందని కేటీఆర్ సందేహం వ్యక్తం చేశారు. పొంగులేటి సోదరుడు ప్రస్తుతం అదే ఫామ్ హౌస్‌లో ఉంటున్నారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి.. తన ఫామ్ హౌస్ ఎఫ్‌టీఎల్ పరిధిలోనే నిర్మించారా? అంటూ కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లోని కానీ, ఎఫ్‌టీఎల్‌లో కానీ తనకంటూ ఎలాంటి ఫామ్ హౌజ్ లేదు.. మీరు చెప్తున్న ఆ ఫామ్ హౌజ్ తన స్నేహితుడిది అని కేటీఆర్ స్పష్టం చేశారు. తన స్నేహితుడి ఫామ్ హౌజ్ ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్‌లో ఉంటే నేనే దగ్గర్నుండి కూలగొట్టిస్తా. నో ప్రాబ్లం.. మంచి జరుగుతున్నప్పుడు అందరం ఆహ్వానించాల్సిందే. కానీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒక్కటే అడుగుతున్నాను. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో మంత్రులు, పెద్ద పెద్ద కాంగ్రెస్ నేతలు కట్టిన రాజభవనాల సంగతి ఏంది..? నా స్నేహితుడి ఫామ్ హౌజ్‌ను మరి జూమ్‌లు పెట్టి తీస్తున్నారు.. అవి సోషల్ మీడియాలో కనబడుతున్నాయి. కానీ చెరువుల్లో కట్టుకున్న మంత్రుల ఫామ్ హౌజ్‌ల సంగతి ఏంది..? చెరువుల్లో కట్టుకున్న బడా కాంగ్రెస్ నాయకుల ఫామ్ హజ్‌లు కూలగొట్టే దమ్ము హైడ్రాకు లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కౌన్సిల్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మధు యాష్కీ వీళ్ళందరి ఫామ్ హౌజ్‌ల దగ్గరికి వెళ్ళి కూలగొడదాం. వీరితో పాటు రేవంత్ రెడ్డిది కూడా ఫామ్ హౌస్ ఉంది. సీఎం ఫామ్ హౌజ్ గురించి శాటిలైట్ మ్యాప్‌లను కూడా మీడియాకు పంపిస్తాను చూసుకోండి. నా పేరు మీద ఫామ్ హౌజం ఉన్నట్లు మీడియాలో ఏవేవో కథనాలు రాస్తున్నారు. కానీ స్పష్టంగా చెబుతున్నా.. నా పేరు మీద ఏ ప్రాపర్టీ లేదు. నేను లీజు మీద ఉన్నాను. ఒక వేళ తప్పు జరిగితే.. దగ్గరుండి కూల్చివేయించేందుకు సహకరిస్తాను. ఇక హైడ్రానో.. అమీబానో ఉంది కదా.. దాని తీసుకొని అక్కడ్నుంచి నేరుగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నుంచి మొదలు పెడుదాం. వాళ్ల తమ్ముడు కూడా అక్కడే ఉన్నాడు. అన్నీ ఒక్కటే రోజు కూలగొడుదాం.. ప్రజలకు పారదర్శకంగా ఉందాం. ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకున్నా నాకు ఎలాంటి ఇబ్బంది, అభ్యంతరం లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.ముందు మంత్రుల ఫామ్ హౌస్‌ల కూల్చివేతతోనే వీటిని ప్రారంభించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు జన్వాడలో ఫామ్ హౌస్ కూల్చవద్దంటూ హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలైంది. బీఆర్ఎస్ నేత ప్రదీప్ రెడ్డి ఈ పిటిషన్ దాఖలు చేశారు. హైదరాబాద్ నగర శివారుల్లో పలువురు రాజకీయ నేతలు, ప్రముఖులు ఫామ్ హౌస్‌లు నిర్మించుకున్నారు. వీటిపై హైడ్రా ఫోకస్ పట్టింది. ఈ ఫామ్ హౌస్‌లు నిబంధనల మేరకు నిర్మించారా? లేక 111 జీవోను ఉల్లంఘించారా? అనే కోణంలో ఓ వైపు హైడ్రా, మరోవైపు ఇరిగేషన్ అధికారులు దృష్టి సారించి.. వివరాలు సేకరిస్తున్నారు. ఓ వేళ నిబంధనలు పట్టించుకోకుండా నిర్మిస్తే... వాటిని కూల్చివేసేందుకు ఐపీఎస్ అధికారి ఎ.వి.రంగనాథ్ సారథ్యంలో 'హైడ్రా' తన పని తాను చేసుకొంటూ ముందుకు వెళ్తుందనే ఓ చర్చ సైతం సాగుతుంది.

**రేవంత్ చిల్లర భాషతో అటెన్షన్ డైవర్ట్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిల్లర భాషపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. సీఎం ఏదో ఒక చిల్లర భాష మాట్లాడి అటెన్షన్ డైవర్ట్ చేయడానికి చూస్తారని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి ఒక టాక్టిక్ అలవాటైంది. అది అటెన్షన్, డైవర్షన్ టాక్టిక్. ఏదో చిల్లర భాష, బజారు భాష మాట్లాడాలి. దాని వైపు దృష్టి మరల్చాలి. దరిద్రం ఏందంటే ఆయనే మాట్లాడే బూతు మాటలు, కేసీఆర్‌ను తిట్టినవి చూపించి పైశాచిక ఆనందం పొందే కొన్ని మీడియా సంస్థలు ఉన్నాయి.. అదో రోగం ఉంది కొన్ని మీడియా సంస్థలకు. ఎందుకంటే వాళ్లకి తెలంగాణ ఇష్టం లేదు.. తెలంగాణ అస్థిత్వం ఇష్టం లేదు అని కేటీఆర్ తెలిపారు.ఇక కేసీఆర్‌ను తిడితే సంకలు గుద్దుకుంటూ, బాగా తిట్టిండు అని సంబురపడే కొందరు సన్నాసులకు చెబుతున్నాను.. మేం అటెన్షన్ డైవర్ట్ కాము. మేం బరాబర్ రైతులతోనే ఉంటాం. కానీ ఇష్యూస్ డైవర్ట్ చేయడానికి రేవంత్ రెడ్డి ఎంత చిల్లరగా మాట్లాడిన, ఎంత బజారు భాష మాట్లాడిన, తన వికృత స్వరూపాన్ని ఎంత బయట పెట్టుకున్నా.. మేం రైతుల కోసమే రణం చేస్తాం. రైతులతోనే ఉంటాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# ఫామ్‌హౌజ్ నీది కాకుంటే నాడు రేవంత్‌పై కేసు ఎందుకు వేశావ్..?

**- కేటీఆర్‌ను ప్రశ్నించిన కేంద్రమంత్రి బండి సంజయ్**

**- పేదల ఇళ్లను కాదు..దొరబాబుల ఇళ్లను కూల్చాలని డిమాండ్**




హైదరాబాద్, (ప్రజా మంటలు): జన్వాడ ఫామ్ హౌస్ కేటీఆర్‌ది కాకుంటే గతంలో రేవంత్ రెడ్డిపై ఎందుకు కేసు నమోదు చేశారో చెప్పాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఆ సమయంలో ఫామ్ హౌస్ సొంతం.. ఇప్పుడు లీజు తీసుకున్నారా అని కెటిఆర్‌ను నిలదీశారు. అక్రమంగా నిర్మించిన ఫామ్ హౌస్‌ల కూల్చివేతను సమర్థించారు. గజాల్లో కట్టిన ఇళ్లను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారని తెలిపారు. భారీ భవన యజమానులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా కలెక్షన్ల కోసమేనని బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై బండి సంజయ్ విమర్శలు చేశారు. ఆయన ఒక్కడే అమాయకుడు అనేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల కోసం డబ్బులు పంపాలని సీఎం రేవంత్ రెడ్డికి హైకమాండ్ టార్గెట్ విధించిందని సంచలన ఆరోపణలు చేశారు. ఆ క్రమంలో హైడ్రా ఆవిర్భవించిందని గుర్తుచేశారు. భారతీయ జనతా పార్టీలో చేరికలకు సంబంధించి కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి, ఎవరొచ్చినా సరే స్వాగతిస్తామని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు, మిగతా నేతలు ఎవరొచ్చినా సరేనని అన్నారు. హరీశ్ రావు పార్టీ మార్పు గురించి గత కొంతకాలంగా చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి పేరును బండి సంజయ్ ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజ్యసభ ఎన్నికల్లో పోటీకి బీఆర్ఎస్ పార్టీ ఎందుకు దూరంగా ఉందని బండి సంజయ్ ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ పార్టీకి లాభం చేసేందుకు కాదా అని అడిగారు. లిక్కర్ కేసులో అరెస్టైన కవిత బెయిల్ కోసం అభిషేక్ మను సింఘ్వీ తీవ్రంగా కృషి చేశారని.. అందుకోసం ఆయనను రాజ్యసభకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పంపిస్తున్నాయని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ.. కేసీఆర్ చెప్పినట్టే నడుస్తోందని బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. మరికొన్ని రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం అవడం ఖాయం అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందం ఉందని, అందుకోసమే విగ్రహాల గొడవ తెరపైకి తీసుకొచ్చారని కేంద్రమంత్రి బండి సంజయ్ గుర్తుచేశారు. ఆరు గ్యారంటీల అమలు గురించి ఎక్కడ ప్రశ్నిస్తామోనని ముందుగా విగ్రహాల అంశాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. సచివాలయం ముందు మాజీ ప్రధాని వాజ్ పేయి విగ్రహం నెలకొల్పాలని తమకు ఉంది. ప్రజా సమస్యల పరిష్కరించడం మంచిదని సూచించారు. విగ్రహాల అంశాన్ని పక్కనపెట్టి, పరిపాలనపై దృష్టిసారించాలని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు.

# అన్యాయమైన మన ప్రాంతం గురించి ఆలోచన. అంటే నా భావజాలంలో మార్పు వచ్చింది

## - సామాజిక తత్వవేత్త బి ఎస్ రాములు

దూళిపాళ అరుణ, రచయిత్రి
8712342323



అందులో రెండు బర్రెలను, ఇంటి వెనుక 100 వనరాజ, గిరిరాజ కోళ్లను పెంచుకుంటే. ఆదాయానికి ఇబ్బంది ఉండదు. ఆ దృష్టి తో చర్చించాము. బలహీన వర్గ విద్యార్థులకు హాస్టళ్లకు బదులుగా రెసిడెన్సీ స్కూళ్ళు ఏర్పాటు చేయాలనేది నా 35 ఏళ్ళ కల. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఆ కల నెరవేరింది. ఇప్పుడు 1000కి పైగా రెసిడెన్షియల్ స్కూళ్ళు, కాలేజీలతో ఐదున్నర లక్షల మంది బాలబాలికలు చక్కని సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందుకుంటున్నారు. వారికి రెసిడెన్సీ స్కూల్లో చేరగానే రెండు నెలల పాటు ఇంగ్లీషు మీడియంలో ఇంగ్లీషులో మాట్లాడే ఉచ్చారణ హాండ్ రైటింగ్ అందంగా కుదిరేలా రాయడం నేర్పుతారు. 9వ తరగతికి వచ్చేసరికల్లా పిల్లలు ప్రపంచ జ్ఞానాన్ని అందుకొని చక్కని వక్తలుగా ఎదుగుతున్నారు. ఇది ఒక గొప్ప కాంట్రిబ్యూషన్. తెలంగాణ తల్లి' అస్తిత్వం ఉండాలని 8 నెలలు కష్టపడి అనేక రూపాలనుండి తెలంగాణ తల్లిని ప్రస్తుత రూపానికి తీసుకురావడం జరిగింది. ఉద్యమంలో ఉన్నప్పుడ ు చేయాలనుకున్నవి కొన్ని ప్రభుత్వంలోకి వచ్చాక సాధికారికంగా చేయడం జరిగింది. ప్రభుత్వంలో ప్రోటోకాల్స్ ద్వారా అత్యున్నత గౌరవాలు అందుకున్నప్పుడు కలిగే ఆనందం, పెరిగే బాధ్యత మనిషిని ఉన్నతీకరిస్తుంది. అలా గవర్నర్, ముఖ్యమంత్రి , మంత్రులు, ఐ ఏ ఎస్ అధికారులు వందలాదిమందిని కలుసుకొని చర్చించడం జరిగింది. పలు కుల సంఘాల నాయకులకు ఆయా రాష్ట్రాల బిసి కమిషన్ నివేదికల అనువాదాలను పంచి, ఉచితంగా వచ్చే సౌకర్యాలను వివరించడం జరిగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా బిసి కమిషన్ ప్రతిష్ఠను, ప్రాచుర్యాన్ని కలిగించడంతో పాటు గొప్ప స్ఫూర్తిని నింపింది. ఇలా ప్రభుత్వాన్ని ప్రభుత్వ పథకాలను ప్రజలకు సాన్నిహిత్యం చేయడం జరిగింది. రాష్ట్రంలోని అన్ని శాఖల్లో బిసి ఉద్యోగులు, వారి శాతం, బిసిల కోసం పెట్టే నూతన పథకాల అవకాశాలు , ఉద్యోగాల ఖాళీలను ఎలా నింపుతున్నారు తెలుసుకోవడం జరిగింది. పారిశ్రామికీకరణ వల్ల యంత్రాల వినియోగం వల్ల లక్షలాదిమందికి ఉపాధి లేకుండా పోయింది.

సుమారుగా 45 శాతం ప్రజలు ఉపాధి కోల్పోయి ఇతరుల మీద ఆధారపడి బతకడం జరుగుతున్నది. ఉన్న ఊరు వదిలి, ఇళ్లను వదిలి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ంఎఱశ్రీశ్రీవం, బఎ ంఎఱశ్రీశ్రీవం శ్రీఖఎశీబతీ గా వలస బతుకులు బతకాల్సి వస్తున్నది. వీరికి జిల్లా పరిధిలో ఉపాధి కల్పించే అవకాశాలు పెంచడం ఎలా? ఈ అంశాలను ప్రాతిపదికగా చేసుకొని 97 డిపార్టుమెంట్ల ఉన్నతాధికారులను, ప్రిన్సిపాల్ సెక్రెటరీలను పిలిచి మాట్లాడడం జరిగింది. అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్స్‌లర్లను బిసి కమిషన్ కార్యాలయానికి పిలిచి విద్యార్థులలో బిసిలు, ఉద్యోగులలో బిసిలు,ఖాళీలు, ఉపాధికల్పనకు సంబంధించిన విషయాలను చర్చించడం జరిగింది. బిసి రిజర్వేషన్ కోటాను పాటించని వారికి నోటీసులు ఇవ్వడం జరిగింది.

ఆయా వ్యక్తులకు, సామాజిక వర్గాలకు సంబంధించిన విజ్ఞప్తులు వచ్చినప్పుడు వాటిని పరిశీలించి పరిష్కరించేలా కృషి చేశాము. ఆసరా పథకం, కళ్యాణలక్ష్మి, బీడీ కార్మికులకు ఆసరా, ఆర్ టి సి కార్మికుల సమస్యలు మొదలైనవెన్నో మా దృష్టికి వచ్చాయి. ఎప్పటికప్పుడు వాటిని ప్రభుత్వానికి నివేదించడం జరిగింది. బిసిల చైతన్యం పెంచడంలో బిసి కమిషన్ నిర్వహించిన పాత్ర మహత్తరమైనది. అలా మూడేళ్లు బిసి కమిషన్ ఛైర్మన్ పదవీ కాలం జీవితంలో మరచిపోలేని అధ్యాయం.

**24. సీనియర్ సాహితీ వేత్తలైన మీరు నేటి రచయితలకు ఏవైనా సూచనలు ఇవ్వండి.**

జ :- నా సూచన ఏమిటంటే బాగా చదవాలి. ప్రజల జీవితాలను ప్రత్యక్షంగా పరిశీలించాలి. రాజకీయాలతో, ప్రభుత్వ నిర్ణయాలతో, సామాజిక ఉద్యమాలతో సైన్స్ అండ్ టెక్నాలజీతో, ప్రపంచీకరణ ప్రయివేటీకరణతో, ప్రచార, ప్రసార దృశ్య మాధ్యమాలతో, మానవ జీవితంలో, కుటుంబ సంబంధాల్లో సంస్కృతిలో , ఆలోచనల్లో , ఆశయాల్లో వస్తున్న మార్పులను పసిగట్టగలగాలి. వాటిని కథల్లో నవలల్లో దృశ్య మీడియాలలో చిత్రించగలగాలి. బాధితుల, పీడితుల వైపు నిలబడి వారికి మద్దతుగా వారి ఆత్మవిశ్వాసం పెంచే విధంగా రచనలు చేయాలి. ఆత్మహత్యలు ఆగిపోయి, ఆ కష్టాలను అధిగమించి, జీవితాన్ని గెలుచుకోగలం అనే విశ్వాసాన్ని కలిగించాలి. నిరాశా నిస్పృహలు కలిగించే సాహిత్యం, భయపెట్టే సాహిత్యం, పిరికివారిని చేసే సాహిత్యం మంచి సాహిత్యం కాదు. వేల సంవత్సరాలుగా శూద్రులు, అతి శూద్రులు ఆదివాసులే సమస్త సంపదల సృష్టికర్తలు. సమస్త నైపుణ్యాలు వారు అభివృద్ధి పరచినవే. ఖనిజాలు, లోహాలు వెలికి తీశారు. కత్తులు, ఆయుధాలు, కోటలు ,దుర్గాలు దేవాలయాలను నిర్మించారు. సంగీతం, కళలు సామూహిక ప్రదర్శనలు వారు సృజించిందే. ఆధునిక పారిశ్రామిక అభివృద్ధి 1810 నుండి విస్తరించి వీరందరూ ఉపాధి కోల్పోతూ వస్తున్నారు. ఈ సమాజ సంపద సృష్టికర్తలు ఇవాళ వెనుకబడిన తరగతిలో వర్గీకరించబడ్డారు. వీరంతా దేశ జనాభాలో 70 శాతానికి పైగా ఉంటారు.

వారికి విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఉన్నత జీవన ప్రమాణాలు నూతన నైపుణ్యాలు అందించడం ప్రభుత్వంతో పాటు అందరి బాధ్యత. ఇవి ఏ మేరకు అందుతున్నాయో, అందలేక పోతున్నాయో కథల్లో, నవలల్లో చిత్రించినపుడే అవి సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న ఇంగ్లీషు కథలు, నవలలు చదవాలి. మంచి సినిమాలు చూడాలి. ఇప్పుడు నవలలకు ప్రాధాన్యత పెరిగింది. పాశ్చాత్య సాహిత్యంలో వాళ్ళు ఎలా రాస్తున్నారో తెలుసుకోవాలి. వాళ్ళవి ఎదిగిన జీవితాలు. అయినా శైలీ శిల్పం, జీవితాలను పరిశీలించే తీరు ఇవన్నీ గమనించాలి. రచయితలు ఒక కుటుంబానికి పరిమితం కాకుండా ప్రభుత్వాలు, పథకాలు, వాటి అమలు, చట్టం, న్యాయం, రాజకీయ పరిణామాలు, ఉద్యమాలను అవి మలువుతున్న తీరును రాయాలి. రచయితలు సామాజిక శాస్త్రాలను, ఆర్థిక శాస్త్రాలను చదవాలి. ప్రతి ఏటా కథలకు, నవలలకు ఎన్నో సంస్థలు బహుమతులు ఇస్తుంటాయి. అలాంటి భారతీయ రచనలను అంతర్జాతీయంగా ఇస్తున్న 'బుకర్ ప్రైజ్' గెలుచుకున్న రచనలను చదవాలి. సోవియట్ రష్యా, అమెరికా, యూరప్ సాహిత్యం చాలా గొప్పవి. 'మొపాసా' అనే ఫ్రెంచ్ రచయిత 150 ఏళ్ళ క్రింద రాసిన సాహిత్యం చదివితేనే ఇంత గొప్పగా ఎలా రాయగలిగారు? అనిపిస్తుంది.

మరి మనం ఆ స్థాయికి ఎప్పుడు ఎదుగుతాం? ఇతర దేశాల్లో వ్యక్తి కుటుంబాలు ఉంటాయి. మన దగ్గర సమిష్టి కుటుంబాలు, కులాలు ఇవన్నీ ప్రాధాన్యం వహిస్తాయి. రచనల్లో ఆ ప్రభావం తప్పక ఉంటుంది. వాస్తవిక చిత్రణల్లో రచన చేయగలగాలి. డా. కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు' అనే అద్భుతమైన నవలను రాశాడు. అది చదివినప్పుడు పందుల వెంట మనమే వెళ్తున్న భావన కలుగుతుంది. అంత చక్కగా పాఠకులను పాత్రలోకి సంలీనం చేయగలిగారు. 'వేట' కథ రాసిన అల్లం శేషగిరావు క్రూర మృగాలను గురించి వాస్తవాలు చిత్రించాడు. ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? ఎక్కడ జరిగింది? అనివార్యం ఎందుకైంది? ఆ అనివార్యం ఎందుకైందో చెప్పడమే తాత్వికత. పాఠకులు పాత్రలతో మమేకమై పోవాలి. అందుకే ఆ స్థాయి రచనల కోసం మనం ప్రయత్నించాలి. ప్రపంచ భాషల సాహిత్యాన్ని మనం చదువుతున్నాం. "తెలుగు సాహిత్యాన్ని చదవాలి" అని ప్రపంచ దేశాలు వారి భాషల్లోనికి అనువదించుకొని చదవాలి. అనే ఆసక్తి కలిగినప్పుడు మన తెలుగు సాహిత్యం ప్రపంచస్థాయికి ఎదిగినట్టు లెక్క.సమాప్తం

మీ విలువైన సమయాన్ని మాకు కేటాయించినందుకు, మీ భావజాలాన్ని, మీరు సమాజం కోసం పడిన తపనను, సాహిత్యం కోసం చేసిన కృషిని గురించి ఓపికగా సమాధానాలు చెప్పినందుకు మా తరపున మరీ మరీ ధన్యవాదాలు.

(- రేపు బిఎస్ రాములు జన్మదినం)

# హైడ్రా నిబంధనలు సమర్పించండి

దృష్టి సారించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. ఇప్పటి వరకు హైడ్రా ఎన్ని కట్టడాలు కూల్చివేసింది, ప్రతి కూల్చివేతలోనూ నిబంధనలు పాటించారా? దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని ఏఏజీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించారా? అని ప్రశ్నించింది. హైదరాబాద్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతోందని, ఆక్రమణలు ఎక్కువయ్యాయని ఏఏజీ కోర్టు దృష్టికి తెచ్చారు. ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులను రక్షించడానికి హైడ్రా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకొని హైడ్రా పనిచేస్తుందన్నారు. స్థానిక సంస్థల ద్వారా నోటీసులు ఇచ్చిన తర్వాతే అక్రమ కట్టడాలు కూల్చివేస్తున్నామని తెలిపారు. ఈ పిటిషన్‌కు విచారణర్హత లేదని, కొట్టివేయాలని కోరారు. 2014లో జన్వాడలో ఫాంహౌస్ ఏర్పాటు చేశారని, 2019లో ప్రదీప్ ఫామ్‌హౌజ్ కొనుగోలు చేసినట్టు పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. పదేళ్ల తర్వాత ఇప్పుడు ఫాంహౌస్ ఎందుకు కూల్చాలనుకుంటున్నారు? ఇన్నేళ్లుగా అధికారులకు ఎఫ్‌టీఎల్ గుర్తుకు రాలేదా? అని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చెరువుల ఎఫ్‌టీఎల్‌ను నోటిఫై చేస్తే ఆ వివరాలు ఇవ్వాలని సూచించింది. ప్రాథమికంగా నోటిఫై చేశామని.. తుది నివేదిక రూపొందించే పనిలో ఉన్నామని ఏఏజీ తెలిపారు. జన్వాడ ఫాంహౌస్ ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన వివరాలు కూడా సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

# పోలాండ్ పర్యటనలో మోదీ

## - ఉక్రెయిన్‌లో శాంతి, స్థిరత్వం త్వరగా తిరిగి రావాలన్న ప్రధాని

దిల్లీ (ప్రజా మంటలు): ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం విదేశీ పర్యటనకు బయల్దేరారు. నేటినుంచి మూడు రోజుల పాటు ఆయన పోలండ్, ఉక్రెయిన్ దేశాల్లో పర్యటించనున్న సంగతి తెలిసిందే. ఈ పర్యటనకు ముందు ప్రధాని మోదీ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఉక్రెయిన్‌లో శాంతి, స్థిరత్వం త్వరగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ”మధ్య ఐరోపాలో భారత్‌కు పోలండ్ కీలక ఆర్థిక భాగస్వామిగా ఉంది. ఇరుదేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పోలండ్ అధ్యక్షుడు ఆండ్రెజ్ దుడా, ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో నా భేటీ కోసం ఎదురుచూస్తున్నా. అక్కడి భారతీయులతోనూ ముచ్చటించనున్నా. ఆ పర్యటనను ముగించుకొని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఆహ్వానం మేరకు కీవ్ వెళ్లనున్నా. ఆ దేశంలో భారత ప్రధాని చేపట్టబోయే తొలి పర్యటన ఇదే కానుంది. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడమే ప్రధానాంశంగా ఈ పర్యటన సాగనుంది. గత రెండేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారంపై జెలెన్‌స్కీతో నా ఆలోచనలు పంచుకొనే అవకాశం కోసం ఎదురుచూస్తున్నా. అక్కడ శాంతి, స్థిరత్వం త్వరగా తిరిగిరావాలని ఆకాంక్షిస్తున్నా” అని మోదీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.తన విదేశీ పర్యటన రెండు దేశాలతో విస్తృతమైన సంబంధాలకు ఉపయోగపడుతుందని, రాబోయే సంవత్సరాల్లో మరింత శక్తివంతమైన బంధాన్ని నెలకొల్పడానికి సహాయపడుతుందని తాను విశ్వసిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. భారత్, పోలండ్ మధ్య దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని ఈ పర్యటన చేపట్టారు. 45 ఏళ్ల తర్వాత ఆ దేశానికి వెళ్తున్న తొలి భారత ప్రధాని ఈయనే కావడం విశేషం. చివరిసారిగా 1979లో నాటి భారత ప్రధాని మొరార్జీ దేశాయ్ పోలండ్‌ను సందర్శించారు. ఇక, గత రెండేళ్లుగా ఉక్రెయిన్ రష్యా మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో మోదీ కీవ్ పర్యటనకు ప్రాధాన్యం సంతరించుకుంది.మోదీ నేడు, రేపు పోలండ్‌లో పర్యటిస్తారు. అక్కడి నుంచి ఆగస్టు 23న ప్రత్యేక రైలులో సుమారు 10 గంటలు ప్రయాణించి కీవ్ చేరుకుంటారు. జెలెన్‌స్కీతో సమావేశమై తిరిగి మళ్లీ రైలు మార్గంలో పోలండ్ చేరుకుంటారు. అనంతరం పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగొస్తారు.

**పోలెండ్ చేరిన మోదీ**

**– అక్కడి నుంచి రైలులో కీవ్‌కు వెళ్లనున్న ప్రధాని..**

రెండు రోజుల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పోలెండ్ చేరుకున్నారు. భారత్, పోలెండ్‌ల మధ్య దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ అక్కడ పర్యటిస్తున్న విషయం తెలిసిందే.అయితే, గత 45ఏళ్లలో భారత ప్రధాని పోలెండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. చివరిసారిగా 1979లో నాటి భారత ప్రధాని మొరార్జీ దేశాయ్ పోలెండ్‌ను సందర్శించారు.రెండు రోజులపాటు పోలెండ్‌లో పర్యటించనున్న మోదీ.. అక్కడ నుంచి ఉక్రెయిన్ వెళ్లనున్నారు. ఆగస్టు 23న ప్రత్యేక రైలులో సుమారు 10 గంటలు ప్రయాణించి కీవ్ చేరుకుంటారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సమావేశమై తిరిగి మళ్లీ రైలు మార్గంలోనే పోలెండ్ చేరుకుంటారు. అనంతరం పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగొస్తారు.తన విదేశీ పర్యటన రెండు దేశాలతో విస్తృతమైన సంబంధాలకు ఉపయోగపడుతుందని, రాబోయే రోజుల్లో మరింత శక్తివంతమైన బంధాన్ని నెలకొల్పడానికి దోహదపడుతుందని తాను విశ్వసిస్తున్నట్లు భారత్ నుంచి బయలుదేరే సమయంలో ప్రధాని మోదీ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా ఉక్రెయిన్–రష్యా మధ్య కొనసాగుతున్న యుద్ధం వేళ ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# అమెరికాలో భారత డాక్టర్ అరాచకాలు

## - చిన్నారులు, మహిళల నగ్న వీడియోలు చిత్రీకరణ

## - వికృతచేష్టలు వెలుగులోకి రావడంతో అరెస్ట్

వాషింగ్టన(ప్రజా మంటలు): అమెరికాలో ఓ భారతీయ వైద్యుడు వికృత చేష్టలకు పాల్పడ్డాడు. గత కొన్నేళ్లుగా చిన్నారులు, మహిళల నగ్న చిత్రాలు, వీడియోలను రహస్యంగా రికార్డ్ చేశాడు. ఎట్టకేలకు భార్య ఫిర్యాదుతో అతడి అరాచకాలు వెలుగులోకి రావడంతో ఇటీవల ఆక్లాండ్ కౌంటీ పోలీసులు అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌కు చెందిన ఒయిమెయిర్ ఎజాజ్ 2011లో వర్క్ వీసాపై అమెరికా వెళ్లాడు. తొలుత కొన్నేళ్ల పాటు అలబామాలో నివాసమున్న అతడు 2018లో మిషిగాన్‌కు మకాం మార్చాడు. ఓ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని పలు ఆసుపత్రుల్లో ఫిజిషియన్‌గా పని చేస్తున్నాడు. అయితే, గత కొన్నేళ్లుగా అతడు లైంగిక దారుణాలకు పాల్పడ్డాడు. తాను పనిచేసే చోట ఆసుపత్రి గదులు, బాత్రూమ్‌లు, చేజింగ్ ఏరియా వంటి ప్రదేశాల్లో రహస్యంగా కెమెరాలు పెట్టి అనేక మంది మహిళలు, చిన్నారుల నగ్న వీడియోలను రికార్డ్ చేశాడు. మహిళలు స్పృహలో లేనప్పుడు వారిపై అభ్యంతరకంగా ప్రవర్తించి ఆ దృశ్యాలను రికార్డ్ చేసేవాడు. ఆసుపత్రుల్లో పేషెంట్లను కూడా లైంగిక వేధించేవాడని అతడిపై ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల అతడి భార్యకు ఈ విషయం తెలియడంతో ఆ వీడియోలను తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆగస్టు 8న పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అనంతరం అతడి ఇంటిని సోదా చేయగా విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. అతడి నివాసంలో ఓ కంప్యూటర్, ఫోన్లు, 15 ఎక్స్‌టర్నల్ స్టోరేజీ డివైజ్‌లను స్వాధీనం చేసుకున్నారు. అందులో వేలాదిగా వీడియోలు ఉన్నట్లు గుర్తించారు. ఒక సింగిల్ హార్డ్ డ్రైవ్‌లో 13వేల వీడియోలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. క్లౌడ్ స్టోరేజ్‌లోనూ ఈ దృశ్యాలను అప్‌లోడ్ చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో అతడిపై నేరాభియోగాలు మోపి జైలుకు పంపించారు. అతడి బాధితుల సంఖ్య చాలా ఎక్కువ ఉందని, దీనిపై పూర్తిగా దర్యాప్తు చేసేందుకు కొన్ని నెలలు పట్టొచ్చని అధికారులు చెబుతున్నారు.

# 'చాందీపురా' కలకలం

## - వైరస్‌తో 28 మంది చిన్నారులు మృతి

గాంధీనగర్ (ప్రజా మంటలు):చాందీపురా వైరస్ బారిన పడి ఇప్పటివరకు 28 మంది చిన్నారులు మృతి చెందినట్లు గుజరాత్ ఆరోగ్యశాఖ మంత్రి రిశికేశ్ పటేల్ వెల్లడించారు.తమ రాష్ట్రంలో జులైలో తొలి కేసు నమోదైనప్పటి నుంచి ఈ వైరస్ బారిన పడి ప్రాణాలు కోల్పోయిన వారంతా 14 ఏళ్ల లోపు చిన్నారులేనని తెలిపారు. ఆప్ ఎమ్మెల్యే ఉమేశ్ మక్వానా అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు మంత్రి ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలను మంత్రి వెల్లడించారు.ఇప్పటివరకు మొత్తంగా 164 మెదడువాపు కేసులు గుర్తించగా.. ఇవన్నీ చాందీపుర వైరస్‌తో పాటు మరికొన్ని వ్యాధికారక వైరస్‌ల వల్ల సంభవించినవేనన్నారు. వీటిలో 61 కేసులు చాందీపురా వైరస్ వల్లే వచ్చాయన్నారు. మెదడువాపు సంబంధిత వైరస్ వల్ల ఇప్పటివరకు 101 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోగా.. అంతా 14 ఏళ్ల లోపువారేన్నారు. వీరిలో 28మంది ఈ వైరస్ సోకి మృతి చెందినట్లు గుర్తించామని.. మిగతావారి మరణానికి మెదడువాపు, ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లే కారణమన్నారు. చాందీపురా వైరస్ సోకినవారిలో 63 మంది చిన్నారులు డిశ్చార్జి అయినట్లు తెలిపారు.రాష్ట్రంలో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని.. గత వారం నుంచి కొత్త కేసులు ఏమీ రాలేదన్నారు. గత 12 రోజులుగా మరణాలు సంభవించలేదని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ వైరస్ నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి క్రిమి సంహారక పౌడర్, లిక్విడ్‌లను పిచికారీ చేయిస్తున్నామన్నారు. గాంధీనగర్‌లోని గుజరాత్ బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ (జీబీఆర్‌సీ) ద్వారా మెదడువాపు వ్యాధికి కారణమై చిన్నారుల్ని బలితీసుకున్న చాందీపురా వైరస్‌తో పాటు ఇతర వైరస్‌లను గుర్తించేందుకు పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు.

# కొత్తపార్టీ పెడతా

## - కలిసి వచ్చే వారితో పొత్తు

## - చంపయీ సోరెన్ కీలక ప్రకటన

రాంచీ (ప్రజా మంటలు): అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఝార్ఖండ్ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం నేత చంపయీ సోరెన్ భాజపాలో చేరనున్నట్లు ఇటీవల జోరుగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా బుధవారం ఆయన కీలక ప్రకటన చేశారు. కొత్త పార్టీని ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు వెల్లడించారు. రాజకీయాలను వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. ”నా ముందున్న మూడు అవకాశాలను ఇదివరకే చెప్పా. రిటైర్మెంట్ తీసుకోవడం, ఆర్గనైజేషన్‌ను ఏర్పాటు చేయడం లేదా స్నేహితుడిని వెతుక్కోవడం. కానీ, నేను ఇప్పుడే రిటైర్ అవ్వను. ఎంతోమంది నాకు మద్దతుగా ఉన్నారు. ఇది నా జీవితంలో కొత్త అధ్యాయం. ఓ కొత్త పార్టీని ప్రారంభించి దాన్ని బలోపేతం చేసే ఆలోచనలో ఉన్నా. నా ప్రయాణంలో ఎవరైనా మంచి మిత్రుడు కలిస్తే వారితో కలిసి ముందుకెళ్తా” అని చంపయీ వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే పార్టీని ప్రారంభిస్తానన్న ఆయన.. ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకునే అవకాశాలను ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు.ఇటీవల ఝార్ఖండ్‌లోని అధికార ఝార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీ (ఏఓఓ)లో లుకలుకలు బయటపడిన సంగతి తెలిసిందే. 'ఝార్ఖండ్ టైగర్'గా పేరొందిన చంపయీ సోరెన్.. ఇటీవల సొంత పార్టీ అధినాయకత్వంపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో తాను ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నానని, ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకోవాల్సిన సమయం వచ్చిందని ఇటీవల ఆయన రాసిన లేఖ వైరల్‌గా మారింది. ఈ క్రమంలోనే కొద్ది రోజుల క్రితం ఆయన దిల్లీ వెళ్లడంతో ఆయన భాజపాలో చేరడం ఖాయమనే ప్రచారం జరిగింది. దీనిపై ఆయన స్పందిస్తూ వ్యక్తిగత పనుల నిమిత్తమే దిల్లీ పర్యటన చేపట్టానని స్పష్టం చేశారు.ఈ పరిణామాలపై సీఎం హేమంత్ సోరెన్ తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు భాజపా ఎమ్మెల్యేల వేట సాగిస్తోందని పరోక్ష విమర్శలు చేశారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల ప్రకటనను ఆలస్యం చేస్తున్నారని కేంద్రాన్ని దుయ్యబట్టారు.

## వ్యాసకర్తలకు వినతి

**రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.**

mantalukathalu@gmail.com

-ఎడిటర్

### కిషన్‌రెడ్డి, రాంబాధవ్‌లకు కాశ్మీర్ ఎన్నికల బాధ్యతలు

న్యూఢిల్లీ,ఆగస్ట్21(ప్రజామంటలు): కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్‌ను బీజేపీ అధిష్ఠానం జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించింది. ఈ మేరకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తర్వులు జారీ చేశారు. జమ్మూ కశ్మీర్‌లో మూడు దశలు అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. సెప్టెంబర్ 18న తొలిదశ, 25న రెండోదశ, అక్టోబర్ ఒకటిన మూడో దశ ఎన్నికలు జరుగనుండగా.. అక్టోబర్ 4న ఫలితాలు వెల్లడవ నున్నాయి. ఈ మేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ప్రకటన విడుదల చేశారు. జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలను ఎన్నికల ఇన్‌చార్జీలుగా నియమించా రని.. నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. మాధవ్ 2014-20 కాలంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్య దర్శిగా పనిచేశారు. జమ్మూ కశ్మీర్, అసోం, ఇతర ఈశాన్య రాష్ట్రాల రాజకీయ వ్యవహారాలను నిర్వహించే బాధ్యత ఆయ నది. సెప్టెంబర్ 26, 2020న పునర్వ్యవస్థీకరణ లో భాగంగా బీజేపీ ఆయనను ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించింది.

## విద్యాపథం

"విద్యా దదాతి వినయం అనేది ఆర్యోక్తి." విద్య వినయాన్ని చేకూరుస్తుంది. విద్య పరిపూర్ణం గావించబడాలంటే సాధారణంగా చదివితే సరిపోదు. దానికి అసాధారణమైన కృషి ,పట్టుదల మెండుగా ఉండాలి. ముందుగా విద్యార్థి లో సరైన దృక్పథం ఉండాలి . లక్ష్యాన్ని సలక్షణంగా నిర్ణయించుకోవాలి .అందుకే "దృష్టిని బట్టి సృష్టి గోచరిస్తుంది" అని మన పెద్దలంటారు. దృక్పథం పట్ల స్పష్టత ఉన్న విద్యార్థి ఏ రంగంలో అయినా తరంగం లా విజృంభిస్తాడు.

విద్యార్థికి దృక్పథంతో పాటు సరైన వాక్కు ఉండాలి. ఆ వాక్కు మనిషికి నిజమైన అలంకారం. "నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది" కదా!. మనిషికి వాక్శుద్ధి ఉంటే వాక్సిద్ధి ఉంటుంది . అలాంటి సరైన వాక్కు విద్యార్థి జ్ఞాన సముపార్జనకు దారి చూపిస్తుంది . జీవితమనే సమరంలో గెలుపు తీరాలకు చేరుస్తుంది .

విద్యలో విద్యార్థికి కావలసిన తదుపరి విద్యా ఉపకరణం చర్య. దీనికి స్పందన,కదలిక అని అర్థం. స్పందనకు మూలం చర్య. విద్యార్థిలో కలిగే ఆసక్తి పూర్వక స్పందనే చర్య. ఈ చర్య ద్వారా చదువులో జ్ఞాన ప్రసారానికి అడ్డంకి లేకుండా భవిష్యజ్జీవనానికి మార్గం సుగమం అవుతుంది.

చదువులో ఏకాగ్రత కూడా చాలా అవసరం. ఏదైనా ఒక అంశం పై మనసును పూర్తి స్థాయిలో లగ్నం చేయడాన్ని ఏకాగ్రత అంటారు. ఏకాగ్రత ఉన్న విద్యార్థి జ్ఞానాన్ని తొందరగా అంది పుచ్చుకుంటాడు. ఏ పనైనా తొందరగా నేర్చుకోగలుగుతాడు. నిత్యోత్సాహిగా ఉంటాడు . ఉత్సాహం ఉన్న విద్యార్థిలో ఆసక్తి ఉంటుంది.ఆసక్తి ఉన్నవాడికి ఏకాగ్రత ఉంటుంది. అది జీవితంలో సంతోషాల పూవులను పూయిస్తుంది.

ఏకాగ్రతతో పాటు విద్యార్థి చేయాల్సింది సరైన కృషి. అప్రయత్నంగా ఎవరూ ఏ రంగంలోనూ రాణించలేరు. అందుకే మన పెద్దలు కృషితో నాస్తి దుర్భిక్షం అంటారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకునే విద్యార్థి సరైన కృషి చేయడం ద్వారా అతని జీవన పథానికి అది సరైన ఊతమవుతుంది. అలాంటి విద్యార్థిలో ఆసక్తి,ఆశక్తి రెండూ ఉంటాయి.

సక్రమమైన చదువు గౌరవప్రదమైన జీవనోపాధిని చూపిస్తుంది.జీవనోపాధికి అనేక కుల వృత్తులు ఉన్నాయి. కానీ ఒక గౌరవ ప్రదమైన జీవనోపాధిని చూపించేది చదువు మాత్రమే.గురుముఖతః నేర్చుకున్న జ్ఞానం విద్యార్థులలో జ్ఞాన దీపాన్ని వెలిగించి ఉపాధికి దారి చూపిస్తుంది. సాధారణమైన వృత్తులు కేవలం ఆ వృత్తులకు మాత్రమే పరిమితమై ఉండి కొత్త ఆవిష్కరణలకు తోడ్పడవు.చదువు వలన పొందిన ఉపాధి ద్వారా సమాజంలో విలువ పెరుగుతుంది. మరియు నూతన ఆవిష్కరణలకు అది దోహదం చేస్తుంది.చదువు మాత్రమే ఆ సౌకర్యాన్ని కలిగించి అసౌకర్యాన్ని దూరం చేస్తుంది. ఇన్ని లక్షణాల ద్వారా నేర్చుకున్న చదువు మనిషిలోని సమగ్ర మూర్తిమత్వాన్ని ఆవిష్కరిస్తుంది. విద్యార్థిలో విశాల దృక్పథాన్ని



పెంపొందిస్తుంది . ఎక్కడైనా విలువగా,నిర్భయంగా బ్రతికే ధైర్యాన్నిస్తుంది.చదువంటే 100 పేజీల పుస్తకం కాదు . వందలమందిలో నిలబెట్టే ధైర్యం. అంతేకాక భౌతిక ప్రపంచ విషయాలను తెలుసుకోవడం, వాటిని మన వాస్తవ జీవితానికి అన్వయించుకోవడం . ఎవరో చెప్పిన విషయాలను సిద్ధాంతంగా ప్రామాణీకరించి చెప్పడం చదువు అంతిమ లక్ష్యం కాదు. వారు చెప్పిన దానిని ఆధారంగా చేసుకొని మనలో ఉన్న సృజనాత్మక శక్తులను మేల్కొలిపి ,మన దృక్పథాన్ని సరిచేస్తూ నూతన ఆవిష్కరణలకు జీవం పోసేదే నిజమైన చదువు . ఆ చదువుకు ఏకాగ్రత ,కృషి ,పట్టుదల ,ఆత్మవిశ్వాసం అనేవి పట్టుగొమ్మలు

అయినంపూడి వెంకట నారాయణ (మన వేమన)
గుంటూరు. 7981 422 372

### కాపురం అవుతుందా

మనసులో ఒకరిని పెట్టుకొని
మండపంలో మరొకరితో
తాళి కట్టించుకుంటే
అది కయ్యాలకు దారితీయక
కాపురం అవుతుందా?

సంసారం.....
సమస్యల సముద్రమవుతుంది!
జీవితం.....
చిరిగిన విస్తరి అవుతుంది!!

జగ్గయ్య.జి
9849525802

## కడలిపాలు

నీరు కూడా కాపాడుకోలేని
నిరుపేద ప్రణాళిక మనది
గలగల గోదారి బిరబిరా కృష్ణమ్మ
కన్నీరు పెడుతుంది
ఎండుతున్న గొంతుల్ని తడపలేక పోతున్నామని
మండుతున్న కడుపుల్ని
ఆర్పలేకపోతున్నామని

వర్షాలకి హర్షాలని కవితలు రాస్తే ఏం
నీళ్లే నీళ్ళని మురిస్తే ఏం
ఎత్తైన కొండల్లోంచి దూకుతుంటే
జనసంద్రం నిల్చుని పర్యాటకులై సంబరపడితే ఎం
వచ్చిన నీరు వచ్చినట్టు పోతే
చినుకులు అమృత ధారలుగా మలుచుకోలేని
కునుకులు తీస్తున్న రాజకీయం
రంకెల రణరంగంగా కొత్త సీఎం
సంకుల సమరాంగంగా పాత సీఎం ల
సిటపటలలో వృథాగా వేల టియం 'సీ'లు
కరువు మీద చళ్ళున చరిచే నీళ్లు మీకు కనపడడం

లేదు
ఆకలి పారద్రోలి పూ(క్రా)తగా సంపూర్ణ
జవసత్వాలతో పంటని శిరసెత్తించే నీళ్లు కనపడడం
లేదు
ప్రకృతికి తిరిగి ప్రత్యుపకారంగా
చేనులోకి పోదామని కలకి భిన్నమై
కడలి కౌగిళ్లలో
చెరిపేసుకొని ఆనవాళ్లు
మూగబోయిన లయల హొయల నదీ పరవళ్ళు

కోటం చంద్రశేఖర్
9492043348


## నిగ్రహం కోల్పోతున్న నేతలు !

విగ్రహాల సంగతి ఎలా ఉన్నా..నేతలకు నిగ్రహం ఉండాలి. మాట్లాడేప్పుడు నిగ్రహంతో మాట్లాడాలి. ఏదిపడితే అది మాట్లాడడం సరికాదు. భాషను పరిమితి మేరకు ఉపయోగించాలి. మరీ ముఖ్యంగా అధికారంలో ఉన్నప్పుడు కొంత నిగ్రహంగా మాట్లాడాలి. ఎన్నికల సమయంలో ప్రచారం కోసం భాషను ఇష్టానుసారం ఉపయోగిస్తున్నారు. వాడరాని పదాలన్నీ వాడేస్తున్నారు. సరే ఎన్నికల ప్రసంగం కాబట్టి వదిలేద్దామని అంతా అనుకుంటారు. కానీ అధికారంలో ఉన్నా..విపక్షంలో ఉన్నా నేతలు తమ మాటల్లో తప్పులు, బూతులు, ఇతరత్రా వాడకూడని పదాలు దొర్లకుండా చూసుకోవాలి. ఎదుటివారి మీద ఎంతగా కోపం ఉన్నా..అందుకు అనుగుణంగానే భాషను ఉపయోగించాలి. ఈ విషయంలో దివంగత వాజ్‌పేయ్ ప్రసంగాలు ఆదర్శంగా తీసుకోవాలి. ఆయన ఎప్పుడూ పరుషంగా మాట్లాడిన సందర్భాలు లేవు. విమర్శలను కూడా సుతిమెత్తగా చేసేవారు. ఒకవేళ ఎవరైనా తనపై విరుచుకు పడ్డా..ఆయన అంతకు మించిన సంయమనంతో సమాధానం చెప్పేవారు. ఒకవేళ పరుషపదజాలంతో ఎవరైనా దూషిస్తే..మీకు ఇది ఉచితం కాదని సున్నితంగా హెచ్చరిక చేసేవారు. మొన్నటి ఎన్నికల సమయంలో ఎపి సిఎంగా ఉన్న జగన్, ఆయన అనుచరులు కూడా బూతులు మాట్లాడారు. తాము పదవుల్లో ఉన్నామన్న జ్ఞానం లేకుండా మాట్లాడారు. ఇలాంటివి ప్రజలు గుర్తిస్తారు. అలాగే హర్షించరని కూడా గుర్తించాలి. ఇప్పుడు తెలంగాణలో విగ్రహాల గొడవ నడుస్తోంది. గతంలో కూడా ఇలాంటిదే నడిచింది. పాలకులకు విగ్రహాల మీద ఉన్న శ్రద్ధ.. ప్రజల సమస్యలపైన లేదు. తెలంగాణ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోంది. ఇంకా వాటిని కాంగ్రెస్ గుర్తించనే లేదు. వాటిపైన దృష్టిని కాస్తా ఇప్పుడు విగ్రహాల మీదకు మరల్చారు. ఎదుటి వారితో సై అంటే సై అనేలా మాటల తూటాలు పేలుతున్నారు. తాజాగా తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం వ్యవహారం ఇప్పుడు దుమారానికి కారణమయ్యింది. అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలను కున్నామని బిఆర్ఎస్ వాదిస్తోంది. కానీ అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలని అధికార కాంగ్రెస్ నిర్ణయించింది. నిజానికి తెలంగాణ కోసం పోరాడిన, అమరులైన వారు ఎందరో ఉన్నారు. వారెవ్వరూ విగ్రహాలు పెట్టించుకునేంత స్థాయికి రాలేదు. ఎందుకంటే నేతలు వారి త్యాగాలను గుర్తించిన సందర్భాలు లేవు. కనీసం ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారిని కూడా గుర్తించలేదు. ఇదే సందర్భంలో ఇప్పుడు రాజీవ్ విగ్రహం పెట్టాల్సిన అవసరం లేదు. అయితే స్వామి భక్తి చాటుకోవాల్సిన అవసరం కాంగ్రెస్‌లో ఎప్పుడూ ఉంటుంది. విగ్రహాలు పెట్టడం లేదా పథకాలకు పేర్లు పెట్టడం ద్వారా కాంగ్రెస్ పెద్దలను ఎప్పుడూ కొలిచే పద్దతి ఒకటి ఉంది. కాంగ్రెస్‌లో ఇలాంటి పనులు చేస్తుండాలి. లేకపోతే అధిష్ఠానం కోపానికి గురికాక తప్పదు. కాంగ్రెస్‌లో నెహ్రూ వారసులను స్మరిస్తూ పోవాలి. రేవంత్ రెడ్డి కూడా ఇలా చేయాల్సిందే. చేయకుండా ఉండలేరు కూడా. అందుకే తెరపైకి రాజీవ్ విగ్రహం వచ్చి చేరింది. గతంలో వైఎస్ కూడా ఇలాగే చేశారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి ఎపిలో రాజధానిగా ఉన్న హైదరాద్ నెక్లెస్ రోడ్డును అందంగా తీర్చి దిద్దారు. పార్కులు కట్టారు. ఇలా ప్రసాద్ ఐ మాక్స్ పక్కన చక్కని సర్కిల్ ఏర్పాటు చేసి, పూలవనంగా తీర్చి దిద్దారు. వైఎస్ సిఎం అయ్యాక అక్కడ ఇందిరాగాంధీ విగ్రహం పెట్టారు. ఇప్పుడు అక్కడ ఆ విగ్రహం ఉంది. విమానాశ్రయానికి రాజీవ్ పేరు పెట్టారు. క్రికెట్ స్టేడియానికి కూడా రాజీవ్ పేరు పెట్టారు. ఇలా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే స్వామిభక్తి చాటుకునేందుకు ఇలాంటి పనులన్నీ చేస్తూ పోవాలి. ఈ క్రమంలోనే ఇప్పుడు రేవంత్ వంతు వచ్చింది. అందుకే సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహం పెట్టాలని తనవంతుగా భక్తిని చాటుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ నిర్ణయాన్ని సహజంగానే బిఆర్ఎస్

వ్యతిరేకించింది. తాము మళ్లీ అధికారంలోకి రాగానే విగ్రహాన్ని తొలగిస్తామని, రాజీవ్ పేరు ఉన్న విమానాశ్రయానికి లోకల్ లీడర్ల పేరు పెడతామని కెటిఆర్ ఘాటుగానే హెచ్చరించారు. రాజీవ్‌కు తెలంగాణకు సంబంధమేమిటని ప్రశ్నించారు. ఈ క్రమంలో సిఎం రేవంత్ రాజీవ్ జయంతి సభ వేదుకగా ఘాటు విమర్శలు చేశారు. రాజీవ్ విగ్రహం పెడితే తొలగిస్తామని కొందరు మాట్లాడుతున్నారు, 'చేతనైనే ఆ విగ్రహాన్ని టచ్ చేయండి.. అంతు చూస్తాం' అని సిఎం రేవంత్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. అధికారం పోయినా బిఆర్ఎస్ నాయకుల్లో కొందరికి అహంకారం తగ్గడం లేదని కూడా మండిపడ్డారు. పనిలోపనిగా

సచివాలయం ఎదుట కెసిఆర్ విగ్రహాన్ని పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు అధికారంలో ఉన్న మీరు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు పెట్టలేదని కూడా బిఆర్ఎస్‌ను ప్రశ్నించారు. పదేళ్లలో ఏనాడూ విగ్రహం పెట్టాలన్న ఆలోచన రాని వాళ్లకు ఈరోజు రాజీవ్ విగ్రహాన్ని పెడితే ప్రశ్నించే నైతిక హక్కు లేదని అన్నారు. డిసెంబర్ 9వ తేదీలోపు సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం కూడా పెడతామని సిఎం రేవంత్ ప్రకటించారు. ఈ విగ్రహాన్ని సచివాలయం లోపలే పెడతామని కూడా స్పష్టం చేశారు.రాజీవ్ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తాం అంటూ..కొంచెం పరుష పదజాలంతోనే విమర్శలు చేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ముట్టుకోకముందే ఏమవుతుందో చూపిస్తామని హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు విచక్షణ కోల్పోయి అర్థం పర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం సామాజిక బహిష్కరణ చేస్తుందని హెచ్చరించారు. రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని మంగళవారం ప్రారంభించాలని ముందుగా నిర్ణయం తీసుకున్నా మని, కానీ, ఇంకా కొన్ని పనులు మిగిలి ఉండటం మూలంగా దానిని వాయిదా వేసుకున్నామని తెలిపారు. రాజీవ్ గాంధీ విగ్రహం అమరవీరుల జ్యోతి పక్కన ఉండటం సముచితం అనికూడా సమర్థించుకున్నారు. అలాగే రాజీవ్ దేశానికి చేసిన సేవల గురించి కూడా ప్రస్తావించారు. చివాలయం ముందు దొంగలకు, తాగుబోతులకు స్థానం లేదని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి విమర్శలు కూడా చేశారు. ఇదే సందర్భంలో పలు విమర్శలు కూడా చేశారు. ఎన్నికల సమయంలో ఇలాంటి భాష వాడితే తప్పులేదు. కానీ ఇప్పుడు ఇలాంటి భాష అవసరం లేదు. అలాగే రాజీవ్ విగ్రహం కూడా అవసరం లేదు. సచివాలయం ముందు ఇంకెవరిదైనా... లేకపోతే ప్రొఫెసర్ జయశంకర్ లాంటి వారి విగ్రహం పెట్టివుంటే హుందాగా ఉండేది. తెలంగాణ ఆకాంక్షలకు అనుగుణంగగా ఉండేది. రాజీవ్‌కు ఇప్పుడు కొత్తగా ఇవ్వాల్సిన గౌరవం ఏమీ లేదు. ఆయనకు దక్కాల్సిన గౌరవం దక్కింది. అదే సందర్భంలో సిఎంగా ఉన్న రేవంత్ రెడ్డి నిగ్రహంతో ఉండాలి. పరుషంగా మాట్లాడడం వల్ల సిఎం హుందాతనాన్ని కోల్పోతారు. ఇదికూడా గమనించాల్సి ఉంది.

## అసమాన కలం యోధుడు షహీద్ షోయబుల్లా ఖాన్





రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

**ఆగస్టు 22... షోయబ్ ఉల్లాఖాన్ వర్ధంతి**

పెన్నును గన్నుగా మార్చి, అక్షరాలను బుల్లెట్లుగా ప్రయోగించి, నాటి నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా రాజీలేని రచనలతో నిజాం ప్రభుత్వానికి నిద్దుర పట్టనీయకుండా వణికించిన షోయబ్ ఉల్లా ఖాన్ అక్షర వీరుడు. ప్రజల కోసం కలం పట్టి ప్రాణాలను తృణ ప్రాయంగా వదలిన ధీరుడు. పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చిన నిజాయితీ పరుడు. తన రచనలతో తెలంగాణ పాత్రికేయ చరిత్రలో సుస్థిర స్థానం పొందిన కలం యోధుడు. లక్ష్య సాధనలో ప్రాణ త్యాగం చేసిన అమరుడు. నిఖార్సైన వాడి వేడితో కూడిన తన రచనల ద్వారా నిజాం ప్రభుత్వ విధానాలను, రజాకార్ల దుశ్చర్యలను ఎండగట్టిన నిబద్దత కలిగిన పాత్రికేయుడు. తన స్వేచ్ఛా రచన జీవితానికి చరమగీతం పాడుతుందని తెలిసినా వెనుకంజ వేయని మేరు నగ ధీరుడు. అపూర్వ త్యాగ ధనుడు.

షోయబ్ ఉల్లాఖాన్ 1920, అక్టోబరు 17 న ఖమ్మం జిల్లా సుబ్రవేడులో జన్మించాడు. తండ్రి హబీబుల్లా ఖాన్. తల్లి లాయహున్నీసా బేగం. వారి కుటుంబం ఉత్తర ప్రదేశ్ నుంచి నిజాం ప్రాంతానికి వలస వచ్చి ఇక్కడ స్థిరపడింది. షోయబ్ ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి బిఎ, జర్నలిజం డిగ్రీ పూర్తి చేశాడు. బొంబాయిలో ఇంటర్మీడియట్ గ్రేడ్ డ్రాయింగ్ పరీక్ష కూడా ఉత్తీర్ణుడైనాడు. తన కుమారునిలో గాంధీ మహాత్ముని పోలికలున్నాయని భావించి హబీబుల్లాఖాన్... 'షోయబుల్లా గాంధీ' అని ముద్దుగా పిలుచుకునే వాడు. గాంధీ లాగానే షోయబ్ కూడా తాను నమ్మిన మార్గంలో ప్రయాణించడంలో నిబద్ధతను, మొండి తనాన్ని ప్రదర్శించాడు.

తెలంగాణ అగ్నిగోళంలా మండుతున్న కాలమది. నిరంకుశ పాలన, దోపిడీ, దౌర్జన్యాలు సాగదంటూ సామా న్యుడు సమరం సాగిస్తున్న సమయమది. అది పత్రికలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న కాలం. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తా ప్రచురణ చేయడానికి సాహసించని గడ్డుకాలం.

ఉస్మానియా యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, ప్రజాస్వామ్య కాంక్షతో దుర్మార్గ పాలనను ఎదురించే చైతన్యంతో క్యాంపస్ నుండి షోయబుల్లా ఖాన్ బయట కొచ్చాడు. సమ సమాజం కోసం, అణగారిన అమాయక ప్రజల కోసం ఏదో చేయాలన్న తపన బలంగా ఉన్న షోయబ్ జాతీయోద్యమ స్ఫూర్తితో జర్నలిజాన్ని వృత్తిగా ఎంచు కున్నాడు. చిత్తశుద్ధి, అంకిత భావం, నిబద్దత కలిగిన జర్నలిస్ట్ గా జీవితం ప్రారంభించాడు.

మొదట షోయబ్ 'తేజ్ 'అనే ఉర్దూ పత్రికలో ఉప సంపాద కుడిగా చేరాడు. నిరంకుశ నిజాం ప్రభుత్వం, ఆయన తాబేదార్లయిన రజాకార్ల దౌర్జన్యాలు, అరాచ కాలను తీవ్ర స్థాయిలో విమర్శిస్తూ వార్తలనే అస్త్రాలను సంధించాడు. ప్రజా సమస్యలపై పాలకులను నిలదీస్తూ ప్రజల్లో చైతన్యం తెచ్చే ప్రయత్నం చేశాడు. చివరకు 'తేజ్' పత్రికను నిషేధించారు. కణకణ మండుతున్న నిప్పుకణికల్లాంటి షోయబుల్లాఖాన్ అక్షరాలకు ప్రచురణ అవకాశం అప్పటికే ముందుముల నర్సింగ రావు నిర్వహణ లోని రయ్యత్ పత్రిక కల్పించింది. ఆయన స్వతంత్ర భావ ప్రకటనలకు ఆ పత్రిక వేదిక అయింది. కొంత కాలానికి నిజాం ప్రభుత్వం 'రయ్యత్' పత్రికను మూసి వేయించింది.

నిజాం దౌర్జన్యాన్ని ఎదిరించ దానికి సొంత పత్రిక ఉంటేనే మంచిదను కున్నాడు షోయబుల్లా ఖాన్. మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు సహాయంతో భార్య, తల్లి నగలను అమ్మి ఇమ్రోజ్ ను స్థాపించాడు. 1947 నవంబర్ 17న మొదటి సంచిక వెలువడింది.

బూర్గుల రామకృష్ణారావు ఇంట్లో ఇమ్రోజ్ ఆఫీస్ ఉండేది. ఉర్దూలో ఇమ్రోజ్ అంటే ఈ రోజు. పాలక వర్గాల దౌర్జన్యాలను, దోపిడీని చీల్చి చెండాడాడు. 'ఇమ్రోజ్' దిన పత్రిక తొలి సంచిక 1947 నవంబరు 17 వ తేదీన వెలువ డింది. నిజాం సంస్థానాన్ని ఇండియన్ యూనియన్ లో విలీనం చేయాల్సిందేనని ఖరాఖండిగా చెబుతూ సంపాదకీయాలు రాశాడు. విశాల దేశ ప్రయోజనాల దృష్ట్యా విలీనం తప్పనిసరి అని పేర్కొన్నాడు. పదునైన విమర్శనాస్త్రాలు సంధించాడు.

ఎక్కడ ఏ మూలన నిజాం ఏలుబడిలో ఆగడాలు చెలరేగుతున్నా, ఎక్కడ ఆర్మీ క్యాంప్స్ ఉన్నా వాటి గురించి నిర్భయంగా రాసేవాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావాల్సిందేనని తన రాతలతో స్పష్టం చేసేవాడు. నిజాంకు వ్యతిరేకంగా ఉన్న ముస్లిం విద్యావంతుల అభిప్రాయాలను ప్రచురించే వాడు. నిజాం మొండి తనానికి, రజాకార్ల ఉన్మాదానికి ఎక్కువ బలవుతోంది పేద ముస్లిం కుటుంబాలు, యువకులేనని ఎన్నో సార్లు ఆవేదన చెందాడు. రచనల ద్వారా బహిర్గతం చేశాడు.

కమ్యూనిస్టులు, ఆర్యసమాజ్ వారు, విద్యార్థులు, యూత్ లీగ్ ఎవరు పోరాటాలు చేసినా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వార్తలన్నీ ప్రముఖంగా ప్రచురించాడు. హైదరాబాద్ ఇండియాలో విలీనం కావడమనేది షోయబుల్లా ఖాన్ కల. లక్ష్యం. దాని కోసం ఆత్మార్పణ కైనా సిద్ద పడ్డాడు. నడి రోడ్డు మీద ప్రాణాలను బలి పెట్టాడు. రజాకార్ల నాయకుడు ఖాసీం రజ్వీ 1948 ఆగష్టు 19 సభలో షోయబ్ చేతులు నరికి వేస్తామని బహిరంగం గానే హెచ్చరించాడు.

1948 అగష్టు 21న.. కాచిగూడ లోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఇమ్రోజ్ ఆఫీసులో పని పూర్తి చేసుకుని అర్ధ రాత్రి బావమరిది ఇస్మాయిల్ ఖాన్ తో కలిసి ఇంటికి బయలు దేరిన షోయబుల్లాను ఒక్కసారిగా పదిమంది దుండగులు చుట్టుముట్టి ఆయన వార్తలు రాసే కుడి అర చేతిని ముష్కరులు నిర్దాక్షిణ్యంగా నరికి వేశారు. అడ్డుకో బోయిన ఇస్మాయిల్ నూ తీవ్రంగా గాయ పరిచి గానీ వదల్లేదు. నెత్తిటి మడుగులో కొట్టుమిట్టాడిన షోయబుల్లాను ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా 1948 ఆగష్టు 22 న తెల్లవారు జామున షోయబ్ తుది శ్వాస విడిచాడు. నిజాం సర్కార్ షోయబ్ అంతిమ యాత్రను నిషేధించింది. అంతిమ యాత్ర పోలీసు బందూకుల మధ్య జరిగింది. గోషామహల్ మాలకుంట శ్మశాన వాటికలో ఆయన ఖననం జరిగింది.

# జనగామ జిల్లా బంద్ విజయవంతం సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు ఎస్సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

**జనగామ ఆగస్ట్ 21 (ప్రజామంటలు):** దేశవ్యాప్తంగా ఎస్.సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన భారత్ బంద్ లో భాగంగా జనగామ జిల్లా కేంద్రంలో బంద్ విజయవంతమైంది. ఇటీవల ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ను పునః పరిశీలించాలని కోరుతూ ఈ బంద్ ను దేశవ్యాప్తంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సంఘాలు బంద్ కు పిలుపునిచ్చాయి.. అందులో భాగంగా జనగామ జిల్లా కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు ఇచ్చిన బంద్ పిలుపుమేరకు విద్యాసంస్థలు, వాణిజ్య వ్యాపార సంస్థలు బంద్ కు సహకరించి విజయవంతం చేశాయి.. ప్రశాంత వాతావరణంలో కొనసాగిన ఈ బంద్ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ కాపీని పూర్తిస్థాయిలో చదివి తదుపరి ఎస్సీల వర్గీకరణ పై తమ నిర్ణయాన్ని ప్రకటించాలని మాల నేతలు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఈ




బంద్ కార్యక్రమానికి జనగామ జిల్లా పోలీసు శాఖ ఏర్పాటుచేసిన పటిష్ట బందోబస్తును అన్ని వర్గాల ప్రజలు హర్షిస్తూ అభినందనలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకులు ( తాటి కుమార్, మాల మహాసభ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల ఇంచార్జీ). ముత్యం నాగభూషణం మాల మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.. గద్ద సాయి మాల మహానాడు యువజన విభాగం జిల్లా అధ్యక్షులు నీలం స్వామి మాల మహాసభ జిల్లా అధ్యక్షులు, గునిగంటి చంద్రశేఖర్ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి, మాల మహాసభ నాయకులు ఎండబట్ల పరశురాములు, అఖిల్ మాల బచ్చన్నపేట నాయకులు చెవుల రాజేష్ మాల, మహానాడు జిల్లా కార్యదర్శి, బందెల నరసింహులు మాల, మహాసభ జిల్లా కార్యదర్శి మాల మహానాడు నాయకుడు యనమల్ల మహేష్, మద్దెల కార్తీక్, మాల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ వెంకన్న బాబు, పల్లె హరీష్, మాల పెద్దలు గద్ద ఉపస్వామి, మేకల శంకరయ్య, ధర్మయ్య, ఏషమల్ల ఎల్లయ్య, మల్యాల శ్రీనివాస్, మాల మహాసభ యువజన నాయకులు ముత్యం సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

**జనగామ ఆగస్ట్ 21 (ప్రజామంటలు):** ఆగస్ట్ 9వ తేదీన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఆర్జికార్ మెడికల్ కాలేజి, హాస్పిటల్లో మహిళా వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిపి దారుణంగా హత్య చేసిన ఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే జ్యూడిషియల్ ఎంక్వయిరీ నిర్వహించి బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలని, జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జనగామ నెహ్రూ పార్క్ నుండి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జనగామ జిల్లా కమిటీ కొవ్వొత్తుల ర్యాలీ శాంతియుతంగా సాగింది. ఈ సందర్భంగా ఐద్వా జనగామ జిల్లా అధ్యక్షులు ఇర్రి అహల్య మాట్లాడుతూ.... జరిగిన దారుణమైన దాడికి సంబంధించిన విషయాలు పోస్టుమార్టంలో బయటపడ్డాయని కానీ పోస్టుమార్టం నివేదిక ఈదాడి ఒకరివల్ల జరిగిన విషయం కాదని తెలియచేస్తున్న




కోల్‌కత్తా ప్రభుత్వం ఒక వ్యక్తిని మాత్రమే బాధ్యుడిని చేయడం అనుమానానికి తావిస్తుందని అన్నారు. వాస్తవ విషయాలను బయటకు రాకుండా చేస్తున్నారని విమర్శించారు. వెంటనే అన్ని వాస్తవాలను వెలికి తీసి దోషులందరినీ కఠినంగా శిక్షించాలన్నారు. తక్షణమే సుప్రీంకోర్టు న్యాయమూర్తిచే న్యాయ విచారణ చేపట్టాలని, తద్వారా దోషులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డాక్టర్లకు ప్రత్యేకంగా మహిళా డాక్టర్లకు, ఇతర మహిళా సిబ్బందికి భద్రత కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐద్వా ఉపాధ్యక్షురాలు పందిళ్ళ కళ్యాణి సహాయ కార్యదర్శి మోకు భవాని, జిల్లా కమిటీ సభ్యులు ఎండి గౌసియా, చింతల శ్రీలత, ఎం.డి. నాజియా, ఎర్ర అనిత, చంద్రకళ బొట్ల పద్మ, అండాలు, యాదమ్మ, లక్ష్మి, రేణుక, భాగ్య, రమ, మమత తదితరులు పాల్గొన్నారు.

# కొలనుపాకలో కనుమరుగైన శాతవాహనుల కాలం నాటి గ్రామం చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి

**జనగామ ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** కొలనుపాక వాగు ఒడ్డున శాతవాహనుల కాలం నాటి ప్రాచీన చారిత్రక గ్రామాన్ని జనగామ జిల్లా కేంద్రానికి చెందిన పరిశోధకుడు రెడ్డి రత్నాకర్ రెడ్డి గుర్తించారు. పరిశోధకుడు గత కొద్దిరోజులుగా ఆలేరు మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా లోని కొలనుపాకను విస్తృతంగా పరిశోధిస్తున్నారు. ఈ క్రమంలో పీతిల్ల వాగు ఒడ్డున పాటిగడ్డపై క్షేత్రస్థాయి పరిశోధన చేశారు.ప్రాచీన కాలం నాటి గ్రామం వదిలి వెళ్ళిన చారిత్రిక ఆధారాలు లభించే చోటును పాటిగడ్డ అంటారు. కొలనుపాక పాటిగడ్డపై ఒకటో శతాబ్దానికి ముందు ఆ తర్వాత కాలంలో మానవ నాగరికత విలసిల్లిందని చెప్పడానికి అనేక చారిత్రక ఆధారాలు లభిస్తున్నాయి.వాగు ఒడ్డు నుండి గోశాల మధ్యలో ఉపరితల పరిశోధనలో శాతవాహన కాలం నాటి బౌద్ధ మత నిర్మాణాలకు ఉపయోగించే పాల రాయి ముక్క, మట్టి పూస, గాజు పూస, వివిధ రంగుల్లో ఉన్న గాజు ముక్కలు, గవ్వలు,అప్పటి విసుర్రాయి పై భాగంలో తిరిగే ఉబ్బెత్తుగా ఉన్న గుండ్రని రాయి, తెలుపు రంగుపై నల్లని గీతలతో డబ్బాలు, డిజైన్లు వేసిన కుండ



పెంకులు, రాతి పనిముట్లు, ఎరుపు నలుపు, బూడిద రంగులో ఉన్న కుండ పెంకులు, ఇటుకల ముక్కలు, కోడి గుడ్డు ఆకారంలో ఉన్న రోలు ఉన్నబండ లభించాయి.ఈ చారిత్రక ఆధారాలను బట్టి ఇక్కడ శాతవాహన కాలంలో 1 నుండి 3 శతాబ్దాలలో ఒక గ్రామం ఏర్పడింది. బౌద్ధం విలసిల్లింది. నల్లటి గ్రానైట్ రాయితో ఉన్న బౌద్ధ శిల్పం జైన దేవాలయం పక్కన సందర్శకులను అనుమతించని ఒక గదిలో ఉంది. సోమేశ్వరాలయం ముందు ఎడమ వైపు ధ్వజ స్థంభం వద్ద భూ గర్భంలో ఇటుకల నిర్మాణం ఉంది. ఆలేరు "బిక్కేరు వాగు" ఒడ్డున ఉంది. బౌద్ధ బిక్షకులు ఇక్కడ ఉండడం వల్ల బిక్కేరు అని పేరు వచ్చింది. బిక్కేరు సమీపంలోనే కొలనుపాక ఉండడం గమనించదగిన విషయం. కొలనుపాక చాళుక్యుల కాలంలో కొంత కాలం రాజధానిగా ఉంది . ఈ కాలంలో పీతిల్ల వాగు ఒకప్పుడు మంచి నీళ్ళవాగు. రక్షణగా కూడా ఉపయోగించి ఉండవచ్చు.

వాగు నుండి జైన ఆలయం వరకు పురావస్తు శాఖ పరిశోధిస్తే భూ గర్భంలో ఉన్న దాగి ఉన్న చరిత్ర బయటపడే అవకాశం ఉందని పరిశోధకుడు రత్నాకర్ రెడ్డి భావించారు.

# రైతులు రుణమాఫీ పై ఆందోళన చెందవద్దు.

**హుజరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి వొడితల ప్రణవ్**

**2 లక్షల వరకు రుణమాఫీ చేసే భాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిది**

**సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ అధికారులను కలవాలి.**


**మాట ఇస్తే తప్పని పార్టీ కాంగ్రెస్ పార్టీ**

**జమ్మికుంట ఆగస్ట్ 21 (ప్రజామంటలు):** సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీలో ఆలస్యం జరిగిన రైతులకు రుణమాఫీ చేసే భాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. రెండు లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులకు ఇప్పటికే విడతల వారీగా వారి ఖాతాలో డబ్బులు జమ చేశామని, మరల రెట్కతులు రుణాలు తీసుకునేందుకు అవకాశం ఇచ్చేలా తమ ప్రభుత్వం బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేశారనీ అన్నారు.కావాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని,దీన్ని రైతులు గమనించాలని కోరారు. గత పదేళ్లలో రైతులు రుణమాఫీ పేరిట ఆగం అయ్యారని, ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీతో రైతులకు న్యాయం చేస్తుంటే దాన్ని చూసి ఓర్వలేక బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పి రైతులను



రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు, గత ప్రభుత్వం లాగా లక్ష రుణమాఫీకి ఐదేండ్ల సమయం తీసుకోలేదని, అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఇచ్చిన మాట తప్పకుండా రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేసిందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రుణమాఫీ కానీ రైతులు అందోళన చెందవద్దని సంభందిత క్లస్టర్ వ్యవసాయశాఖ అధికారుల దగ్గరకు వెళ్లి పత్రాలను ఇస్తే వారు పరిశీలించిన తర్వాత రుణమాఫీ అవుతుందని అన్నారు.

# లక్ష పుష్పార్చన, సామూహిక కుంకుమార్చన



**జనగామ అగస్టు 21 (ప్రజామంటలు) :** శ్రావణమాసం పురస్కరించుకొని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అత్యంత వైభవోపేతంగా వివిధ రకాల 21 రకాల పూలతో లక్ష పుష్పార్చన, సామూహిక కుంకుమార్చన అన్నప్రసాద వినియోగ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనేక మంది భక్తులు అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించి దర్శించుకున్నారు. వాసవి మాత ట్రస్ట్ నూతన భవనం గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు పజ్జూరి గోపయ్య, బుద్ధ రమేష్, పజూరి లక్ష్మీ నరసయ్య, మహంకాళి హరిచంద్ర గుప్తా, బిజ్జాల నవీన్ కుమార్, జైన రమేష్, అయిత శ్రీనివాస్ అరుగుల శ్రీనివాస్, రామిని రాజేశ్వర్, పుల్లూరి శ్రీనివాస్, పజ్జూరి జయహరి, గట్టు వెంకటేశ్వర్లు, యాంసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

# గాంధీ మెట్రో స్టేషన్ వద్ద డెడ్ బాడీ మర్డరా? అనారోగ్యంతో మరణమా...?

## అనుమానస్పద మృతిగా కేసు నమోదు

**సికింద్రాబాద్ ఆగస్ట్ 21 (ప్రజామంటలు):** అనుమానస్పదస్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన గాంధీ మెట్రోస్టేషన్ వద్ద జరిగింది. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, అడ్మిన్ ఎస్ఐ బాలరాజులు తెలిపిన వివరాల ప్రకారం... చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయిగూడ మెట్రోపిల్లర్ బీ1015 సమీపంలోని క్యాథలిక్ సెమెట్రీ వద్ద ఓ వ్యక్తి






రక్తపు మడుగులో పడిఉన్నట్లు బుధవారం ఉదయం డయల్ 100కు సమాచారం అందింది. వెంటనే చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్ రెడ్డి, సిబ్బందితో కలసి ఘటనస్థలానికి చేరుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీమార్చురీలో భద్ర పరిచారు. ముక్కు నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందినట్లు గుర్తించారు. ఎవరైన దాడి చేసి హత్య చేశారా, అనారోగ్య కారణాలతో మృతి చెందాడా అనే కోణంలో పోలీసులు ఇన్వెస్ట్ గేషన్ చేస్తున్నారు. క్లూస్, డాగ్ టీమ్‌లతో ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులు పలు ఆధారాలను సేకరించారు. ముస్లిం కమ్యూనిటీకి చెందిన మృతునికి సుమారు 45-50 ఏళ్లు ఉంటాయని, ముక్కునుంచి బ్లడ్ బ్లీడింగ్ మినహా శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, మృతుని బంధువులు, కుటుంబసభ్యులు గుర్తించి చిలకలగూడ పోలీసులకు నేరుగా లేదా ఫోన్ నంబర్లు 8712661252, 8712661050 లకు సమాచారం అందించాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తి అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిలకలగూడ పోలీసులు తెలిపారు.

# బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సాడిగె మహేష్

**కోరుట్ల ఆగస్ట్ 21 (ప్రజామంటలు):** భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కోరుట్ల పట్టణానికి చెందిన సాడిగే మహేష్ ను నియమించినట్లు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు చెవెళ్ల మహేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన సాడిగే మహేష్ గతంలో కోరుట్ల పట్టణ బీజేవైఎం అధ్యక్షులుగా జగిత్యాల జిల్లా కార్యదర్శిగా పార్టీకి సేవలు



అందించారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ బీజేవైఎం పటిష్టతకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.తన నియమాకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.



కోరుట్ల పట్టణంలో శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణ రావు, అనూప్ రావు తదితరులు. వారికి ఘన స్వాగతం పలికి,శాలువా తో సత్కరించిన ఆలయ అర్చకులు.

# భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లికి బోనాల సమర్పణ

## పాపయ్య పల్లి గ్రామంలో ఐదు సంవత్సరాలకు ఒక్కసారి బోనాలు




**జమ్మికుంట ఆగస్ట్ 21 (ప్రజామంటలు):** జమ్మికుంట మండలం పాపయ్యపల్లి గ్రామంలో శ్రావణమాసం సందర్భంగా పోచమ్మ తల్లి బోనాలను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు పాపయ్యపల్లి గ్రామంలో శ్రావణమాసంలో ఐదు సంవత్సరాలకు ఒక్కసారి పోచమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహిస్తుంటారు శ్రావణ మాసంలో మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో ఒక్క పొద్దులు ఉంటూ పోచమ్మ తల్లి బోనాలను నిర్వహిస్తూ ఉంటారు. గ్రామంలోని గొడ్డు, గోదా బాగుండి, పాడి పంట మంచిగా పండాలని గ్రామం సుభిక్షంగా ఉండాలని పోచమ్మ తల్లి బోనాలను సమర్పిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దామెర గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత



**ఎల్కతుర్తి ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో అనారోగ్య పరిస్థితుల వల్ల ఆస్పత్రి లో చికిత్స పొంది ఆరోగ్యశ్రీలో అమలు కానీ వాటికి సీఎం సహాయనిది తక్షణ సాయం కోసం ఎల్కతుర్తి మండలం లోని దామెర గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గ్రామపంచాయతీ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశానుసారం దామెర కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కడారి రాజేందర్ గ్రామ శాఖ అధ్యక్షులు టకురి రాంసింగ్ సీఎం తక్షణ సహాయనిధి క్రింద సుమారు 63500 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు అండగా ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారాధ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే అభివృద్ధిలో అనేక సంక్షేమ పథకాలు అమలుపరచి ముందుకు సాగిపోతుందని అన్నారు . ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చల్ల రమణారెడ్డి గొర్రె ఆదాం, గొర్రె కొమురయ్య (చుక్క) పిల్లల నరేందర్, జంపాల వెంకటయ్య, బాధితులు చల్ల అనిల్ రెడ్డి, రావులా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో డ్రైనేజి వ్యవస్థను పరిశుభ్రంగా ఉంచాలి

## కలెక్టర్ బి. సత్య ప్రసాద్




**జగిత్యాల ఆగస్ట్ 21 (ప్రజా మంటలు):** మున్సిపాలిటీలో డ్రైనేజి వ్యవస్థను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాల మున్సిపాలిటి లో డ్రైనేజి వ్యవస్థను, ముంపు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. డ్రైనేజి వ్యవస్థను శుభ్రంగా ఉంచుటకు ఎప్పటికపుడు శానిటేషన్ చేయించాలని మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని నీటి నిల్వలు ఉండకుండా, ఇండ్లలోకి నీరు వెళ్ళకుండా నీటిని దారి మళ్లించి పెద్ద డ్రైనేజిని నిర్మించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జగిత్యాల్ ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, వివిధ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొన్న డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్



**హసన్ పర్తి ఆగస్ట్ 21 (ప్రజామంటలు):** హసన్ పర్తి 56 డివిజన్ గోపాలపూర్ లో ఉదయం సాయి నగర్ కాలనీలో తీజ్ పండుగ ఉత్సవాల్లో డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాం నాయక్ కాంగ్రెస్ ముఖ్య నాయకులు మరియు గూడెం రమేష్ మరియు తీజ్ పండుగ కమిటీ అధ్యక్షులు మరియు కార్యదర్శులు సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ పండుగను పురస్కరించుకొని సిరంగి సునీల్ గారు మాట్లాడుతూ బంజార బిడ్డల ఆత్మగౌరావనికి ప్రతికగా నిలిచే తీజ్ పండుగ వారి కుటుంబ సభ్యులలో ఆనందాన్ని నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ప్రతి సంవత్సరం ఈ సంస్కృతిక పండుగలో భాగస్వామ్యం అవడం వారి కుటుంబలతో మమేకమవడం హర్షించదగ్గ విషయమని, తెలియజేస్తూ అందరికి తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన జగిత్యాల జిల్లా ఎలక్ట్రికల్ ఎస్.ఈ గా నూతనంగా నియామకమైన ఈ. సాలియా నాయక్. ఈ కార్యక్రమంలో డిఈ రాజిరెడ్డి, డిఈ టెక్నికల్ గంగారాం, డిఈఎం ఆర్.టి. రవీందర్, ఏడిఈ జవహర్ నాయక్, ఏఈలు అశోక్, రహీం తదితరులు పాల్గొన్నారు.

# హసన్పర్తి పెద్ద చెరువులో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం



**హసన్ పర్తి ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** హసన్పర్తి పెద్ద చెరువులో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం వయసు: సుమారు 50 సంవత్సరాలు, బట్టతల, తెలుపు గడ్డం సుమారు రెండు రోజుల క్రితం పడి చనిపోయి శరీరం ఉబ్బి ఉన్నది, నాలుక బయటికి వచ్చి, కళ్ళు బయటికి ఉబ్బి ఉన్నవి. దుస్తులు: శరీరంపై ఫుల్ తెలుపు రంగు బనియన్, రెడ్ పట్టి కట్ డ్రాయర్, దానిపైన ముదురు ఆకుపచ్చ రంగు లేత ఆరెంజ్ కలర్ లైన్లు కల ఫుల్ రాయల్ డ్రాయర్, దానిపైన నలుపు కలర్ షార్ట్ కుడివైపు చినిగి ఉంది. ముఖానికి లేత ఆరెంజ్ కలర్ దస్తి మాస్క్ వలె కట్టబడి ఉంది. ఆచూకీ తెలిసినవారు దయచేసి ఇన్స్పెక్టర్ హసన్పర్తి 8712685124, ఎస్సై హసన్పర్తి 8712685097 , పోలీస్ స్టేషన్ హసన్పర్తి 8712685015 లను సంప్రదించగలరు.

# జనగామ జిల్లా ఆసుపత్రిలో సిటీ స్కాన్ ఏర్పాటు చేయకపోతే

## 'ఆమరణ నిరాహార దీక్ష చేస్తా'

### అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్



**జనగామ ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** జనగామ జిల్లా ఆసుపత్రిలో సిటీ స్కాన్ ఏర్పాటు చేయకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ అన్నారు. జనగామలో అయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనగామ జిల్లా కేంద్రంలో జిల్లా ఆస్పత్రిలో మూడు నియోజకవర్గాల నుండి జనగామ నిరుపేద ప్రజలు అనారోగ్యం నుండి ఆరోగ్యవంతుల అవడానికి వస్తుంటారు. ఇక్కడ సిటీ స్కానింగ్ సౌకర్యం లేక ప్రైవేటు స్కానింగ్ సెంటర్లకు పంపిస్తూ వరంగల్ లేదా హైదరాబాద్‌కు రాస్తూ రోగులను ఇబ్బందుల పాలు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ కి అనేకసార్లు విన్నవించాము. నిరసన కార్యక్రమాలు చేపట్టడం కూడా చేపట్టాం.ఎంత చెప్పినా ఆచరణలోకి రాని సిటీ స్కానింగ్ సేవలు ఇప్పటికైనా జనగామ జిల్లా కలెక్టర్ జనగామ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వెంటనే స్పందించి సిటీ స్కానింగ్ సేవలు అందించాలి. లేనిపక్షంలో పేద ప్రజల కోసం రోగుల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని, రాజకీయ నాయకులు ఆలోచించి సిటి స్కాన్ సేవలు ప్రజలలోకి అందుబాటులోకి తేవాలని మణి డిమాండ్ చేశారు.

# కోరుట్ల, రాయికల్ మండలాల లోని మీ సేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా మేనేజర్ మమత



**కోరుట్ల / రాయికల్ ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** కోరుట్ల, రాయికల్ మండలంలోని మీ సేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మీసేవ పనితీరును మీసేవ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా నూతన నూతనం గా ప్రవేశపెట్టిన క్యూఆర్ కోడ్ పేమెంట్ విధానాన్ని పరిశీలించి ప్రజలందరూ క్యాష్ లెస్ డిజిటల్ పేమెంట్ చేయాలని సూచించారు. దీనివలన ఎలాంటి అదనపు రుసుము చెల్లించకుండా ఉపయోగపడుతుందని ప్రజలకు తెలిపారు. జిల్లాలో అన్ని మీసేవ సెంటర్లు ఈఎస్డి గైడ్లైన్స్ ప్రకారము నడుచుకోవాలని దరఖాస్తుదారుల దగ్గర ఎలాంటి అధిక రుసుములు తీసుకోకుండా మీసేవ సర్వీసులు చేయాలని హెచ్చరించారు. లేకపోతే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందులో టిజి టిఎస్ మీసేవ జిల్లా మేనేజర్ చేతన్ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీశ్రీ గోపాల్ దాస్ భజన మండలి 76వ వార్షికోత్సవం



**సికింద్రాబాద్ ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** శ్రీశ్రీ గోపాల్ దాస్ భజన మండలి 76వ గురుపూజ వార్షికోత్సవాన్ని బన్సీలాల్ ప్లేట్ లోని హిందూ స్మశాన వాటికలో శ్రీ గోపాల్ దాస్ మఠంలో ఘనంగా నిర్వహించారు. ఈ మఠం పిఠాధీపతి శరణ్ దాస్ (శంకర్ బాబు) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మధ్యప్రదేశ్ నుంచి విచ్చేసిన సంత్ బోదుప్రియ సాహెబ్,విజిత్ సాహెబ్, భీష్మ శరణ్ సాహెబ్, సునీత సాహెబ్ తో పాటు ఏడుగురు మహాత్ములు హాజరై భక్తి యొక్క విశిష్టత, జీవన ముక్తి మార్గాన్ని ప్రవచనాలుగా వినిపించారు. ఈ సందర్భంగా నగర వ్యాప్తంగా ఉన్నటువంటి శ్రీ గోపాల్ దాస్, మాత లింగమాంబ శిష్య బృందాలు వివిధ భజన మండలాల నుండి భక్తులు హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తి గేయాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో మండలి అధ్యక్షులు కిషోర్ కుమార్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ బాబు, భక్తులు ఆర్. మార్కండేయ, భగత్ శ్రీనివాస్, గణేష్ పాల్గొన్నారు. గాయకులు దిలీప్ కుమార్, సిరిగిరి నర్సింగ్ రావు, ఎన్. వై. అశోక్,ఈశ్వర్, విజయ్ లు ఆలపించిన భజన గేయాలు అందరిని అలరించాయి.

# కరీంనగర్, జగిత్యాల జాతీయ రహదారిపై పూడూరు వద్ద రైతులతో కలిసి ఆందోళన చేసిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**కొడిమ్యాల ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** రుణమాఫీ మీద కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని సగం మందికి కూడా రుణమాఫీ చేయలేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కాంగ్రెస్ ప్రభుత్వం పై మండిపడ్డారు. కరీంనగర్ జగిత్యాల జాతీయ రహదారిపై పూడూరు వద్ద రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు నేల మీదనే పడుకొని ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు రవిశంకర్ ఆందోళన చేస్తున్న రైతులను బి ఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకొని అక్కడి నుంచి పంపించి వేశారు కొద్దిసేపు బి ఆర్ఎస్ నేతలతో పోలీసులు తమ వాగ్వివాదం పెట్టుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దొంగ హామీలతో గద్దెనెక్కిందని రవిశంకర్ మండిపడ్డారు. రుణమాఫీ అమలు అందరికీ కావాలి రైతులందరూ డిమాండ్ చేయడమైనది.

# పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత



**జనగామ అగస్టు 21 (ప్రజామంటలు):** జనగామ మండలంలోని పెంబర్తి గ్రామానికి చెందిన సంకటి రామ్మూర్తి పరమపదించగా బాధిత కుటుంబ సభ్యులను యూత్ కాంగ్రెస్ నాయకులు ఆవుల ప్రశాంత్ రెడ్డి బుధవారం పరామర్శించి వారి కుటుంబానికి రూపాయలు 5000 ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో నీర్మాల రత్నం, సంకటి ఎల్లయ్య, కంతిరి రాజు, శాగ శివయ్య, సంకటి రమేష్, శివ, ఎల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సుడిగాలి పర్యటనలతో దూసుకుపోతున్న థామస్

- రాష్ట్ర యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా గెలిచే అవకాశం
- యువతలో మంచి గుర్తింపు, రాష్ట్ర, కేంద్ర నాయకులతో సత్సంబంధాలు
- ఈ సందర్భంగా థామస్ పై ప్రత్యేక కథనం

**హైద్రాబాద్ ఆగస్టు 21 (ప్రజామంటలు) :** తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష బరిలో నిలిచిన ఎస్.వై.థామస్ హుస్నాబాద్, హుజురాబాద్ నియోజకవర్గాలలో సుడిగాలి పర్యటనలతో యువతలో ఉత్తేజాన్ని నింపారు. యువతలో మంచి గుర్తింపు వున్న థామస్ గెలుపుపై యువత ధీమా వ్యక్తం చేశారు.విద్యార్థి ఉద్యమాల్లో పోరాటాలు చేసిన థామస్ తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షునిగా బరిలో నిలిచారు. రాష్ట్ర వ్యాప్తంగా యువతలో వున్న గుర్తింపుతో రాష్ట్ర అధ్యక్షునిగా గెలిచే అవకాశం వుందని విశ్వాసనీయ సమాచారం.ఎన్ఎస్ యుఐ కాంగ్రెస్ లో పని చేసిన అనుభవం రాష్ట్ర కేంద్ర నాయకులతో మంచి సంబంధాలు ఉండడం, సమస్యల పరిష్కారంలో ముందు నిలవడం, అడ్వకేట్ గా అనుభవం ఇవ్వన్నీ థామస్ గెలుపుకి దోహదం చేస్తాయి.

# జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం




**జగిత్యాల ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** బుధవారం జగిత్యాల లోని మినీ స్టేడియంలోని పైకాభవనంలో జిల్లా విద్యాధికారి బి. జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం జిల్లా పాఠశాలల క్రీడల నిర్వహణ కొరకు నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా సెప్టెంబర్ 10న అండర్ 17 బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్, 11న అండర్ 17 బాలురకు కబడ్డీ కోకో వాలీబాల్ 12 9 2024న అండర్ 14 బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్ 13న అండర్ 14 బాలురకు కబడ్డీ కోకో వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరుగును ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి బీ. లక్ష్మి రాం నాయక్ జిల్లాపేట అధ్యక్షులు సెక్రెటరీ ఈ. విశ్వప్రసాద్ ఎస్. అశోక్ పీడీలు పీఈటీలు పాల్గొన్నారు. పీఈటీలు పాఠశాలలో విద్యార్థులలో క్రమశిక్షణను పెంచుతూ క్రీడల్లో మన జిల్లాకు మంచి పేరు తేవాలని తెలిపారు అదేవిధంగా జిల్లాలోని మండల స్థాయి క్రీడలను సెప్టెంబర్ 6వ తేదీలోపు నిర్వహించుకోవాలని తెలిపారు.

# ఇదేమీ పారిశుద్ధ్యం...? ఇంత అధ్వాన్నమా?




**సికింద్రాబాద్ ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** బన్సీలాల్ పేట డివిజన్ లో పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసిన చెత్త కుప్పలు, రోడ్లపై డ్రైనేజీ మురికి నీరే కనిపిస్తున్నాయి. అసలే వర్షాకాలం..ఆపై డెంగ్యూ లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలుతున్న వేళ జీహెచ్ఎమ్సీ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పద్మారావునగర్ లోని హమాలీబస్తీలో ట్రాన్స్ఫార్మర్ వద్ద చెత్తకుప్పలు పెరిగిపోయి, దోమలు,దుర్వాసన వ్యాపిస్తున్నాయి. మేకలమండి నుంచి గాంధీనగర్ వెళ్ళే ప్రధాన రహదారి డ్రైనేజీల లీకింగ్ ల నుంచి వస్తున్న మురికి నీటితో మునిగిపోయింది. పద్మారావునగర్ అభినవ్ నగర్ కాలనీలో కూడ మురికి నీరు రోడ్లపై పారుతోంది. పారిశుద్ధ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఓ వైపు ప్రకటనలు ఊదరగొడుతుంటే, మరోవైపు క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడుతోంది.

## మహిళ సంఘాల వివో బిల్లింగ్ కోసం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం
### ఇచ్చిన మహిళా సంఘం సభ్యులు



**వేలేర్ ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** వేలేరు మండలం ఎర్రబెల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ముద్దసాని వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎర్రబెల్లి గ్రామ మహిళ సంఘాల వివో బిల్లింగ్ కోసం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి వినీత్ పత్రం ఇచ్చిన మహిళా సంఘం సభ్యులు సీఏ. వెంకటలక్ష్మి మరియు అరుణా దేవి. ఈ కార్యక్రమంలో దస్తరి శ్రావణ్ కుమార్, కాలేరు శ్రావణ్ కుమార్, నలిమేల దిలీప్, ధోనికెళ్ళ సురేష్, ప్రవీణ్, అశోక్, మురళి, దయాకర్, సింగారపు రాజు, గూడా యాదగిరి, ఎండి ఫరీద్, సంపత్ నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేవుని కృప ఉంటే అన్నీ ఉన్నట్లే ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**కోరుట్ల ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** దైవసంకల్పంతో చేపట్టిన ప్రతి పని విజయవంతంగా పూర్తి అవుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోరుట్ల పట్టణంలోని అతి పురాతనమైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ లక్ష్మీదేవి విక్షైన ఆంజనేయ నూతన ఉప ఆలయాల ద్వారపాలక రాజగోపుర శిఖర విమాన వెంకటేశ్వర విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన రెండవ రోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ జగిత్యాల నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ యం. సంజయ్ లు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వామి వారి శేషవస్త్రాలు కప్పి ఆశీర్వదించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆ దేవుని కృప ఉంటే అన్ని పనులు విజయవంతం అవుతాయని ఆయన తెలిపారు. స్వర్గీయ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఈ వెంకటేశ్వర ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, తాను వేములవాడ దేవస్థానం కమిటీ చైర్మన్ గా ఈ ఆలయ అభివృద్ధి కోసం నాలుగు లక్షల రూపాయలు మంజూరు చేసి, ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అనంతరం ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో వెంకటేశ్వర ఆలయ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు



చేయకపోవడమే కాకుండా ఆలయాన్ని పట్టించుకున్న నాథుడే లేకుండా పోయారన్నారు. మళ్ళీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జువ్వాడి నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ల ప్రోత్బలంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి ఆలయ విషయాన్ని తెలియజేయగా వెంటనే నిధులు మంజూరు చేయడం జరిగింది. అందులో భాగంగానే ఇప్పుడు ఈ నూతన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని ఆలయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కావున భక్తుల సహకారం ఉంటే అన్ని జరుగుతాయని కావున భక్తులు దాతల సహకారంతో నేడు ఈ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తో పాటు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ యం. సంజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, ఆలయ ఈవో ఎం విక్రమ్, మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్, కోరుట్ల పట్టణ ప్రముఖ వైద్యులు డాక్టర్ వై అనుప్ రావు, కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, మహిళా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షురాలు మచ్చ కవిత, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, వెంకటేశ్వర దేవాలయ మాజీ అధ్యక్షులు పుప్పాల ప్రభాకర్, జక్కుల ప్రసాద్, కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం, తిరుమల వసంత గంగాధర్, శీలం జయలక్ష్మి వేణుగోపాల్, పుప్పాల ఉమాదేవి ప్రభాకర్, కోఆప్షన్ సభ్యురాలు రెంజర్ల కల్యాణి, నాయకులు అన్నం అనిల్ , శీలం వేణుగోపాల్, కొత్త సురేష్, ఇందూరి సత్యం, మ్యాకల నర్సయ్య, వోలేపు రాజేష్, గడేల విజయ్, గడేల అశోక్, దండిక కిషోర్, శ్రీకాంత్, తెడ్డు విజయ్, ఆలయ ప్రధాన అర్చకులు బీర్నంది నర్సింహాచారి, శ్రీనివాసాచారి, వేద బ్రాహ్మణ భాగవతములు చక్రపాణి మధుసూదనాచార్య, చక్రపాణి నర్సింహా మూర్తి, పలువురు అర్చకులు, వివిధ హోదాల నాయకులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు



**ఇబ్రహీంపట్నం ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో నీ వర్షకొండ గ్రామం లో హై స్కూల్ యందు మెట్టుపల్లి సీఐ గారి ఆధ్వర్యంలో ఇబ్రహింపట్నం ఎస్సై గారు విద్యార్థులకు ప్రస్తుతం సమాజంలో జరుగుతున్నా వివిధ రకాలైన సైబర్ నేరాల గురించి అవగాహన కలిపిస్తు, వాటి నుండి ఎలా రక్షించుకోవలో తెలియజేస్తూ, గంజాయికి కి అలవాటు పడకూడదు అంటూ తెలుపుతూ వాటి వాళ్ళ వచ్చే అనర్ధాల గురించి వివరణ తెలిపారు, ట్రాఫిక్ మరియు హెల్మెట్ ధరించడం పైన అవగాహన కల్పిస్తూ పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మెట్టుపల్లి సిఐ, ఇబ్రహీంపట్నం ఎస్సై, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గల్ఫ్ మోసాల పై చైతన్య దీపిక..ఇంకెన్నాళ్ళీ కన్నీళ్లు కన్నీళ్లు పుస్తకం
### గల్ఫ్ మోసాలపై షేక్ చాంద్ పాషా రాసిన మొదటి కాపీ ఎస్పీ, కలెక్టర్ కు అందజేత

**జగిత్యాల ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** మూడు రోజులుగా గల్ఫ్ బాధితుల సమస్యల పై జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సమీక్ష అనంతరం మరిన్ని వివరాల కోసం షేక్ చాంద్ పాషా ఎస్పీ ని కలిసి గల్ఫ్ మోసాలను వివరించారు. ఇంకెన్నాళ్లీ కన్నీళ్లు అనే పుస్తకాన్ని ఎస్పీ అశోక్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ కు అందజేశారు. గల్ఫ్ సమస్యలపై, గల్ఫ్ మోసాల పై డాక్టర్ షేక్ చాంద్ పాష నివేదిక ఎస్పీ, కలెక్టర్ కు అందజేశారు. ఇమ్మిగ్రేషన్ నిబంధనలు, ఏజెంట్లు ఏవిధంగా ఉల్లంగిస్తున్నరనే అంశాలపై తన ఆత్మ కథను రాసినట్లు షేక్ చాంద్ పాషా



తెలిపారు. ప్రజల్లో చట్టాల పై అవగాహన కల్పించేందుకు గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారని అన్నారు. చాంద్ పాషా ఆత్మకథ పుస్తకం లో గల్ఫ్ మోసాలపై సవివరంగా రాశానని అన్నారు. విదేశాల్లో చిక్కుకున్న వేలాది మందిని స్వదేశానికి రప్పించానని షేక్ చాంద్ పాషా అన్నారు. ఎన్ఆర్ఐ కమిషన్, కోర్టు, హెల్ప్ లైన్ సెంటర్, ఎన్ ఆర్ ఐ పోలీస్ ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తు చేశారు. గల్ఫ్ లో మృతి చెందిన వారికి రూ. 5 లక్షలు పరిహారం అందించాలని డాక్టర్ షేక్ చాంద్ పాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ బాధితుల పక్షాన పోలీసులు ఇమ్మిగ్రేషన్ అధికారులతో సమావేశం నిర్వహించనుండడం హర్షించదగ్గ విషయం. 25 ఏళ్ల గల్ఫ్ మోసాలపై 140 పేజీలతో రాసిన ఇంకెన్నాళ్ళీ కన్నీళ్లు పుస్తకం త్వరలో హిందీ, ఇంగ్లీష్, , ఉర్దూ భాషల్లో ఆవిష్కరించనున్నమని షేక్ చాంద్ పాషా తెలిపారు. గల్ఫ్ ఏజెంట్ల మోసాలకు గురి అయినవారు 9949321330 నంబర్ లో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ డాక్టర్ షేక్ చాంద్ పాషా ను సంప్రదించాలి అని సూచించారు.

## సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం పేరుతోని హరేరామ, హరేకృష్ణ, ఫౌండేషన్ ద్వారా వంటలు చేయడానికి ప్రయత్నించడం విరమించుకోవాలి ఏఐటియుసి

**కోరుట్ల ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** పాఠశాల వంట కార్మికుల సమస్యల పై,ఈరోజు తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి), రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా, జగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సుతారి రాములు మాట్లాడుతూ%%. వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలనే లక్ష్యంతో అనేక పోరాటాలు నిర్వహించడం జరిగినది అన్నారు,ఆనాడు జరిగిన పోరాటాలు న్యాయభద్దమైనవి ,అవి తప్పనిసరిగా పరిష్కరించాలని మద్దతు పలికి ,ప్రత్యక్షంగా నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటుగా ,సీతక్క కోమటిరెడ్డి వెంకటరెడ్డి చాలా మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, కూడా పాల్గొన్నారు ,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ,వంట కార్మికులకు నెలకు రూ. 10 వేల వేతనం అందిస్తామని అన్నారు. అలాగే వంట కార్మికులకు ఉద్యోగ భద్రత కలిపిస్తాము అన్నారు. కానీ దానికి భిన్నంగా గ్రామాలలో రాజకీయ కారణాలతో కార్మికులను తొలగించే పనిలో పడ్డారు అన్నారు, విద్యార్థులకు ఇస్తున్న మెనూ చార్జీలు కూడా, నేటి మార్కెట్ ధరలకు అనుగుణంగా పెంచుతాము అన్నారు, కానీ అధికారంలోకి వచ్చి 8, నెలలు గడుస్తున్నా వారు ఇచ్చిన హామీలు




అమలుకు నోచుకోవడం లేదని అన్నారు. అదీ కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 54,200,మంది వంట కార్మికులను రోడ్డున పడేసే విధంగా, సెంట్రలైజ్డ్ కిచెన్ విధానంతో ,వంట కార్యక్రమాన్ని హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా వంటలు చేయడానికి ప్రయత్నించడం చాలా అన్యాయమని ఆయన అన్నారు. ఇప్పటికే 5 నెలలుగా వంట బిల్లులు, కోడిగుడ్ల బిల్లులు, అల్పాహారం బిల్లులు వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని ఆయన అన్నారు, కోడిగుడ్డు ధర మార్కెట్లో రూ, 7,లబిస్తుంటే ప్రభుత్వం మాత్రం రూ 5, ఇస్తుంది నష్టం ఎంతో మీరే గమనించాలి అన్నారు. మీకు నష్టం వస్తేమాకేంటి బరాబర్ వారానికి మూడుసార్లు గుడ్లు వడ్డించవలసిందేనని ప్రధానోపాధ్యాయులు హుకుం జారీ చేస్తున్నారు, ఎంతవరకు సమంజసం అన్నారు. అందుకే ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా వంటలు చేయడానికి ప్రయత్నించడం విరమించుకోవాలి, అలాగే హామీ ఇచ్చిన రూ, 10 వేల వేతనం వెంటనే అందించాలని, మార్కెట్ ధరలకు అనుగుణంగా, మెనూ చార్జీలు తరగతితో సంబంధం లేకుండా ప్రతీ విద్యార్థికి రూ. 25, అందించాలని, లేదా కోడిగుడ్లతో సహ, కూరకాయలు, గ్యాస్, అన్నీ ప్రభుత్వమే సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు, సమస్యలు వెంటనే పరిష్కరించాలని సెప్టెంబర్ 9, 10 తేదీలలో టోకెన్ సమ్మె చేయగలము, దానికి వచ్చే దసరా పండుగ లోపు పరిష్కరించాలని, లేనియెడల దసరా సెలవుల తరువాత సమ్మె లోకి వెళ్ళవలసి వస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు సుతారి రాములు, ముణుగురి హనుమంతు, శ్రీగాధ దేవదాసు, వెన్న మహేష్ , ఎండి షంషేర్ , ఎస్. భీమయ్య, కొంక భాగ్య, జి.శారద, డి. లత, ఎం.డి. జరీనా, , సీ.హెచ్, గంగాధర్ , కె. భాగ్య, కె. సుగుణ, సీ.హెచ్,శారద అనేకమంది మధ్యాహ్న భోజన వర్కర్లు ఇందులో పాల్గొన్నారు.

## సందెల పద్మ అనారోగ్యంతో అకాల మరణం వారి కుటుంబాన్ని పరామర్శించిన 65వ. డివిజన్ కాంగ్రెస్ నాయకులు
### లౌడియా రాజు నాయక్ (లడ్డు రాజు)



**హసన్ పర్తి ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** సందెల పద్మ అనారోగ్యంతో అకాల మరణం చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించిన 65వ. డివిజన్ కాంగ్రెస్ నాయకులు లౌడియా రాజు నాయక్ (లడ్డు రాజు) ఆర్థిక సాయంగా 6000 రూపాయలను వారి కొడుకు అయిన సందెల చంటి (ఆటో డ్రైవర్) మరియు కుటుంబ సభ్యులకు...అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ,జిల్లా నాయకులు, మండల నాయకులు, యూత్ నాయకులు, డివిజన్ నాయకులు, గ్రామ కమిటీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఎల్వోసి లు అందజేసిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



**జగిత్యాల ఆగస్ట్ 21 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణ 39వ వార్డు వాణి నగర్ కు చెందిన ఎం శ్రీనివాస్ తండ్రి బ్రహ్మయ్య తుంటి ఎముక సమస్య తో బాధపడుతూ ఉండగా స్థానిక నాయకులు సమిండ్ల శ్రీనివాస్ వారి ఆర్థిక పరిస్తితి గురించి ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన 2 లక్షల రూపాయల విలువ గల ఎల్ఓసిని శ్రీనివాస్ కు ఎమ్మెల్యే క్వార్టర్స్ లో అందజేసిన శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ .జగిత్యాల పట్టణ 13వ వార్డు సలేమా గార్డెన్స్ కు వాడ కు చెందిన మహమ్మద్ ఆసిఫ్ తండ్రి మహమ్మద్ సత్తార్ నేత్ర సంబంధిత నరాల సమస్య తో బాధపడుతూ,శస్త్ర చికిత్స చేసుకొనే ఆర్థిక పరిస్తితి లేక ఇబ్బంది పడుతూ ఉండగా స్థానిక నాయకులు సమస్యను ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ దృష్టికి తీసుకురాగా సీఎం సహాయనిది ద్వారా మంజూరైన 2 లక్షల 65 వేల రూపాయలు విలువగల ఎల్ఓసి ని జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఆసిఫ్ కు అందజేసిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోడ్ల జగదీష్, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీ మాజీ సభ్యులు ధూమాల రాజ్ కుమార్, యంఏ షకీర్, ఫిరోజ్, జమీల్, తదితరులు ఉన్నారు.

## అలుపెరగని పోరాట యోధుడు మంద కృష్ణ మాదిగ



**సికింద్రాబాద్ ఆగస్ట్ 21 (ప్రజామంటలు) :** గత మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసి, చివరికి లక్ష్యాన్ని సాధించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ గొప్ప నాయకుడుగా చరిత్రలో నిలిచిపోతారని అఖిల భారత ముదిరాజ్ సంఘం ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్లకాయల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం హైదరాబాద్ సోమాజిగూడ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు ఈసందర్భంగా మందకృష్ణ మాదిగను ఘనంగా సత్కరించారు. 30 ఏండ్ల సుదీర్ఘకాలంలో ఏనాడు కూడ పాలకుల ఇచ్చే తాయిలాలకు లొంగకుండా , ఎబీసీడీ వర్గీకరణ ఉద్యమం ఎక్కడ కూడ ఆగిపోకుండా ముందుకు నడిపించిన గొప్ప నాయకులు మందకృష్ణ మాదిగ అని కొనియాడారు. మాదిగ జాతి ఎప్పటికీ మందకృష్ణ మాదిగ కు రుణపడి ఉంటుందన్నారు. వర్గీకరణ తో అణగారిన మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. అటు సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా తీర్పు రాగానే వెంటనే స్పందించి ఇటు తెలంగాణ లో ఎబీసీడీ వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పొట్లకాయల వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు.

## ఫార్మా కంపెనీలో ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణకు సీఎం ఆదేశం

**అమరావతి (ప్రజా మంటలు) :** అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఫార్మాకంపెనీలో జరిగిన ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. ప్రమాదంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.ముఖ్యమంత్రి గురువారం అచ్యుతాపురంలో పర్యటించను న్నారు.ఫార్మా కంపెనీ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను, ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించనున్నా రు.ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తారు.ప్రమాద ఘటనపై హెల్త్ సెక్రటరీ, సెక్రటరీ ఇండస్ట్రీస్, డైరెక్టర్ ఫ్యాక్టరీస్, కమిషనర్ లేబర్, డైరెక్టర్ బాయిలర్స్, ఎస్డీఆర్ఎఫ్ సహా జిల్లా ఉన్నతాధికారుతో ఎప్పటికప్పుడు సీఎం మాట్లాడి వారికి సూచనలు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన 41 మందికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.అవసరమైతే ు విశాఖ లేదా హైదరాబా ద్‌కు ఎయిర్ అంబులెన్స్ ద్వారా తరలించాలని సూచించారు.కార్మికుల ప్రాణాలు కాపాడడానికి ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించాలని అధికారులకు స్పష్టం చేశారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com